భక్తి యోగం

# భగవానుని 5 నివాస స్థానాలు



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో భాగంగా ఈ పుస్తకాన్ని ద్వారకాధీష్ వాస్తు వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో భాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) ద్వారకాధీష్ వాస్తు వారి వెబ్ సైట్: http://dwarkadheeshvastu.com
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో ద్వారకాధీష్ వాస్తు వారి వెబ్ సైట్ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org

Facebook: www.facebook.com/freegurukul Helpline/WhatsApp: 9042020123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## ద్వారకాదీష్ వాస్తు వారి వెబ్ సైట్:

## http://dwarkadheeshvastu.com



# అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.

రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖



మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రీహరిః

# అయిదు భగవానుని నివాసస్థానాలు

# పంచ మహాయజ్ఞాలు

ఒకప్పుడు వేదవ్యాసభగవానుడు తన శిష్యులతో ఇలా అన్నాడు – శిష్యులారా! నేను ఇప్పుడు మీకు అయిదు ధర్మాలకు సంబంధించిన ఆఖ్యానాలను వినిపిస్తున్నాను. అందు ఏ ఒక్క ధర్మాన్ని అనుష్ఠించినా మానవుడు అనాయాసంగా లోకంలో సత్కీర్తిని, స్వర్గాన్ని, మోక్షాన్ని కూడ పొందగలుగుతాడు. కాబట్టి నేను చెప్పే మాటలను శ్రద్ధగా ఆలకించండి.

శ్లో. పిత్రోరర్చాథ పత్యుశ్చ సమః (సామ్యం) సర్వజనేషు చ ।
మిత్రాద్రోహో విష్ణుభక్తిరేతే పంచ మహామఖాః ॥

ప్రాక్ పిత్రోరర్చయా విప్రా యద్ధర్మం సాధయేన్నరః ।
న తత్క్రతుశతైరేవ తీర్థయాత్రాదిభిర్భువి ॥

పితా ధర్మః పితా స్వర్గః పితా హి పరమం తపః ।
పితరి ప్రీతిమాపన్నే ప్రీయంతే సర్వదేవతాః ॥

పితరో యస్య తృప్యంతి సేవయా చ గుణేన చ ।
తస్య భాగీరథీస్నానమహన్యహని వర్తతే ॥

సర్వతీర్థమయీ మాతా సర్వదేవమయః పితా
మాతరం పితరం తస్మాత్ సర్వయత్నేన పూజయేత్ ॥

మాతరం పితరం చైవ యస్తు కుర్యాత్ప్రదక్షిణమ్ ।
ప్రదక్షిణీకృతా తేన సప్తద్వీపా వసుంధరా ॥

జానునీ చ కరౌ యస్య పిత్రోః ప్రణమతః శిరః ।
నిపతన్తి పృథివ్యాం చ సోఽక్షయం లభతే దివమ్ ॥

(పద్మపురాణ. సృష్టిఖండం 47/7–13)

అనగా మాతాపితరులను పూజించుట, పతిని సేవించుట, సమస్తజనులయందును సమత్వబుద్ధి కలిగియుండుట, మిత్రద్రోహానికి పాల్పడకుండుట, విష్ణుదేవునియందు భక్తి కలిగియుండుట, అను ఈ అయిదునూ మహాయజ్ఞాలు అనబడతాయి.

బ్రాహ్మణులారా! ప్రప్రథమంలో మాతాపితరులను సేవించి మానవుడు ఏ ధర్మాన్ని సాధించుకొన్నవాడు కాగలడో ఆ ధర్మాన్ని భూమి మీద వందలకొలది యజ్ఞాలు, తీర్థయాత్రలు చేసి కూడ అతడు పొందలేడు. తండ్రియే ధర్మము. తండ్రియే స్వర్గము. తండ్రియే సర్వోత్కృష్టమైన తపస్స్వరూపం. అతడు ప్రసన్నుడు అయితే దేవతలు అందరూ ప్రసన్నులు అవుతారు. తన సేవలచేతను, సద్గుణసంపదచేతను నిరంతరమూ తన మాతాపితరులను సంతోషపెట్టే తనయుడు దినదినమూ గంగానదీస్నానమహాపుణ్యఫలాన్ని పొందుతాడు. సర్వతీర్థస్వరూపిణి తల్లి సమస్తదేవతాస్వరూపుడు తండ్రి. కాబట్టి నిత్యమూ ప్రయత్నపూర్వకంగా మానవుడు తన మాతాపితరులను పూజించుకొంటూ ఉండాలి. వారికి ప్రదక్షిణం చేస్తే సప్తద్వీపసమాలంకృతమైన సమస్తభూమండలానికి ప్రదక్షిణం చేసినంత పుణ్యఫలం ప్రాప్తిస్తుంది. హస్తాలు, మస్తకము, మోకాళ్లు నేలను అంటే విధంగా వంగి మాతాపితరులకు ప్రణమిల్లే కుమారునకు అక్షయమైన స్వర్గసౌఖ్యం సిద్ధిస్తుంది.

మాతాపితరుల చరణధూళి యెంతవరకు ఒడలిని అంటుకొని ఉంటుందో అంతవరకు మానవుడు పవిత్రుడుగా ఉంటాడు. వారి

పాదోదకమును సేవించిన కుమారుని యొక్క అనేకకోటి జన్మగతాలైన పాపాలు అన్నీ తత్కాలమందే నశించిపోతాయి. అట్టి మానవుడు ధన్యజన్ముడు అవుతాడు. మాతాపితరుల ఆజ్ఞలను తిరస్కరించే మానవుడు పరమనీచుడు. అట్టివాడు మహాప్రళయకాలము వచ్చేవరకు నరకాగ్నిలో మ్రగ్గుతూ ఉంటాడు.

శ్లో. రోగిణం చాపి వృద్ధం చ పితరం వృత్తికర్శితమ్
ఏకలం నేత్రకర్ణాభ్యాం త్యక్త్వా గచ్ఛేచ్చ రౌరవమ్ ॥

(పద్మపురాణం, సృష్టిఖండం. 47/19)

వ్యాధిగ్రస్తుడు, వృద్ధుడు, జీవికాసంపాదనం చేసుకోలేనివాడు, కన్నులు, చెవులూ పని చేయనివాడూ అయిన తండ్రిని అసహాయునిగా విడిచిపోయిన మానవుడు రౌరవనరకాన్ని పొందుతాడు.

అంతేకాక అట్టివాడు అంత్యజులు, మ్లేచ్ఛులు, చండాలురు మున్నగు నీచజాతులలో జన్మ ఎత్తవలసినవాడు అవుతాడు. మాతాపితరుల పోషణసంరక్షణభారాన్ని విడనాడినవాని పుణ్యాలు అన్నీ క్షీణించిపోతాయి. తల్లిదండ్రుల ఆరాధనమునూ సేవనమునూ విడచి పుత్రుడైనవాడు ఏ తీర్థయాత్రలు చేసినా, ఏ దేవతలను సేవించినా ఫలితం ఏదీ ఉండదు.

బ్రాహ్మణులారా! ఈ విషయంలో మీకు ఒక ప్రాచీనమైన ఇతిహాసాన్ని వివరిస్తున్నాను. సావధానంగా ఆలకించండి. ఈ గాథను ఆలకిస్తే ఇక మిమ్ము ఎన్నడూ మోహం ఆవరించదు.

ఇది ప్రాచీనకాలము నాటి విషయం. పూర్వం ఒక బ్రాహ్మణుడు ఉండేవాడు. అతని పేరు నరోత్తముడు. అతడు ఒకప్పుడు తన మాతాపితరులను తృణీకరించి తీర్థయాత్రలు చేయ బోయినాడు. సర్వతీర్థస్థలాలలోనూ తిరుగాడుతూ ఉన్న ఆ బ్రాహ్మణుని వస్త్రాలు దినదినమూ ఆకాశంలోనే ఆరిపోతూ ఉండేవి. తనయందు ఉన్న ఆ

ప్రభావం కారణంగా అతనిలో అణచలేని అహంకారం ఆవిర్భవించింది. తనవంటి పుణ్యపురుషుడు, తనవంటి కీర్తిశాలి మరియొకడు లేడని అతడు మిక్కిలి గర్వపడడం మొదలుపెట్టాడు. ఒకనాడు అతడు ఈ మాటలే అంటూ మొగము మీదికి ఎత్తగా ఆ సమయంలో ఆకాశంమీద ఎగురుతూ ఉన్న ఒక కొంగ అతని మొగంమీద రెట్ట వేసింది. అప్పుడు అతడు క్రుద్ధుడై దానిని శపించాడు.

వెంటనే అది పిడికెడు భస్మమై నేలమీద రాలిపడింది. ఆ విధంగా కొంగ మరణించగా చూచి నరోత్తమునిలో మహాగర్వం ప్రవేశించింది. ఆ పాపాచరణం కారణంగా అతనిలో ఆకాశంలో ఉండగానే వస్త్రం ఆరిపోవునట్టి ప్రభావం ఏది ఉన్నదో అది అంతరించిపోయింది. ఆ విషయాన్ని గుర్తించి అతడు ఎంతో చింతించాడు. అనంతరం ఆకాశవాణి ఆ బ్రాహ్మణునితో "బ్రాహ్మణోత్తమా! పరమధర్మాత్ముడైన మూకచండాలుడు ఒకడున్నాడు. నీవు ఇప్పుడు అతని వద్దకు వెళ్ళవలసినది. అక్కడ నీకు ధర్మజ్ఞానం కలుగుతుంది. వాని మాటలు విన్న నీకు శుభం చేకూరుతుంది" అని పలికింది.

అప్పుడు ఆ బ్రాహ్మణుడు వెదుక్కుంటూ ఆ మూకచండాలుని దగ్గరకు వెళ్ళాడు. ఆ సమయంలో ఆ చండాలుడు సర్వవిధాల తన మాతాపితరులను సేవించుటలో నిమగ్నుడై ఉన్నాడు. చలికాలంలో అతడు తన మాతాపితరులకు స్నానానికై ఉష్ణోదకం సమకూరుస్తూ ఉంటాడు. వారి శరీరములపై తైలమర్దనం చేస్తాడు. చలికాచుకొనుటకు కుంపటి వెలిగించి వారి ముందు ఉంచుతాడు. భోజనానంతరం వారికి తాంబూలం అందిస్తాడు. కట్టుకొనుటకు ఉన్నిబట్టలు అర్పిస్తాడు. దినదినమూ వారికి మృష్టాన్నభోజనం సమకూరుస్తాడు. వసంతకాలంలో సుగంధబంధురాలైన ఇప్పపూదండలు మొదలైన పూలదండలను వారి మెడలో ధరింపజేస్తాడు. ఇవియే కాక యింకను అనేకములైన భోగసామగ్రులను వారికి సమకూర్చి ముదమును కలిగిస్తూ ఉంటాడు. వారి యితరకాంక్షలను కూడ ఎప్పటికప్పుడు సఫలం చేస్తూ ఉంటాడు.

వేసవికాలంలో వారికి అతడు వీవనలతో విసరుతూ ఉంటాడు. ఈ విధంగా దినదినమూ వారికి సేవలు చేసి అనంతరం తాను భోజనం చేసేవాడు. తన తల్లిదండ్రుల అలసటనూ, కష్టాన్ని నివారించడం అనేది అతనికి నిత్యనియమంగా ఉండేది. ఈ పుణ్యకర్మల ప్రభావం కారణంగా అతని గృహం ఏ ఆధారాలూ, స్తంభాదులూ లేకుండ ఆకాశంలో నిలిచి ఉండేది. ఆ గృహములో త్రిభువనాధిపతి, భగవానుడూ అయిన శ్రీహరి సుందరబ్రాహ్మణరూపంలో నిత్యమూ క్రీడిస్తూ ఉండేవాడు. సత్యస్వరూపుడైన ఆ పరమాత్మ మహత్తరమైన తన సత్యతేజోమయమైన విగ్రహంతో ఆ చండాలగృహానికి అలంకారశోభను కలుగజేస్తూ ఉండేవాడు. ఇదంతా చూడగా నరోత్తమునకు పరమాశ్చర్యం కలిగింది. అతడు ఆ మూకచండాలుని – నాయనా! నా చెంతకు రమ్ము! నేను నిన్ను సమస్తలోకాలకు హితం కలిగించే సనాతనవిషయమును తెలుప గోరుచున్నాను, విస్పష్టముగా నాకు ఎరిగింపుము. అని పలుకరించాడు.

అప్పుడు మూకచండాలుడు ఇలా అన్నాడు – బ్రాహ్మణదేవతా! ఇప్పుడు నేను నా మాతాపితరులకు సేవలు చేసుకుంటున్నాను. మీ చెంతకు రాలేను. వీరి సేవాకార్యక్రమం ముగిసిన పిదప మీ కడకు రాగలను. అంతవరకు ద్వారం చెంత నిలిచి యుండండి. అప్పుడు మీకు అతిథిసత్కారములు ఆచరిస్తాను.

ఆ మాటలు వినుటతోడనే నరోత్తముడు బ్రాహ్మణత్వసంబంధమైన అహంకారం కారణంగా ఆగ్రహోదగ్రుడు అయ్యాడు. బ్రాహ్మణశ్రేష్ఠుడనైన నా సేవకన్న నీకు ఏ కార్యక్రమం మిన్న అయినది? అని హుంకరించాడు.

అంతట చండాలుడు ఇలా అన్నాడు – మహాత్మా! ఊరక ఏల క్రోధాన్ని బహిర్గతం చేస్తారు? మీ క్రోధాగ్నిలో బడి భస్మం అయ్యేకొంగను కాను నేను. మీ క్రోధం ఆ కొంగమీదనే చెల్లుతుంది. నా మీద చెల్లదు. పూర్వంలోవలె ఇప్పుడు మీ వస్త్రం ఆకాశంలో నిలవడమూ లేదు. ఆరడమూ లేదు. ఆకాశవాణిని ఆలకించి మీరు నా చెంతకు వచ్చినారు. ఒకింత తడవు నిలువగలిగితే నేను మీరు అడిగినదానికి బదులు

చెప్పగలను కాదందురా? పతివ్రతాస్త్రీ యొకతె ఉన్నది కదా. ఆమె కడకు వెడలుడు. ఆమెను దర్శించిన మీదట మీ యభీష్టము నెరవేరుతుంది.

అనంతరం ఆ చండాలుని యింటిలోపలనుండి బ్రాహ్మణరూపంలో ఉన్న శ్రీమహావిష్ణువు వెలికి వచ్చి పదండి! బ్రాహ్మణోత్తమా! నేను కూడ మీ వెంట ఆ పతివ్రతాస్త్రీ యింటికి వస్తాను అని నరోత్తమునితో పలికాడు. ఏమో ఆలోచించుకొని నరోత్తముడు అతనిని అనుగమించాడు. అతడు ఎంతో విస్మయం పొందుతూ ముందుకు సాగుతున్నాడు. త్రోవలో అతడు బ్రాహ్మణోత్తమా! మీరు స్త్రీజనసంకులమైన ఆ చండాలుని యింటిలో ఎలా ఉంటున్నారు? ఎందులకు ఉంటున్నారు? అని బ్రాహ్మణవేషధారియైన భగవానుని ప్రశ్నించాడు.

బ్రాహ్మణదేవతా! ప్రస్తుతం మీ మనస్సు పరిశుద్ధంగా లేదు. ముందు పతివ్రతాదులను సందర్శించండి. అనంతరం మీరు నన్ను బాగుగా అర్థం చేసుకోగలుగుతారు అని భగవానుడు బదులు పలికాడు.

ఆర్యా! ఆ పతివ్రత యెవరు? ఆమెకు ఉన్న శాస్త్రజ్ఞానం ఏపాటి గొప్పది? నేనామె దగ్గరకు ఎందుకు వెళ్ళాలి? ఇది కూడ నాకు తెలియజేయండి అని నరోత్తముడు మరల ప్రశ్నించాడు.

బ్రాహ్మణోత్తమా! నదులలో గంగానది, స్త్రీలలో పతివ్రత, దేవతలలో మహావిష్ణువు శ్రేష్ఠులు.

శ్లో. పతివ్రతా చ యా నారీ పత్యుర్నిత్యం హితే రతా
కులద్వయస్య పురుషాన్ ఉద్ధరేత్సా శతం శతమ్ ॥

(పద్మపురాణం. సృష్టిఖండం.47/51)

అనుదినమూ పతికి హితం కలిగించడంలో నిమగ్నురాలై యుండే స్త్రీ తన పాతివ్రత్యనిష్ఠచేత తన పితృవంశము, భర్తృవంశములందలి నూరు

తరాలవారిని సముద్ధరిస్తుంది. అని భగవానుడు మరల బదులు చెప్పాడు.

అయితే విప్రోత్తమా! ఏ స్త్రీ పతివ్రత అనబడుతుంది? ఆమె లక్షణాలు ఎలా ఉంటాయి? నాకు బాగుగా అర్థం అయ్యే విధంగా తెలియజెప్పండి అని నరోత్తముడు మరల ప్రశ్నించాడు. అప్పుడు భగవానుడు ఇలా సమాధానం చెబుతున్నాడు:

శ్లో. పుత్రాచ్ఛతగుణం స్నేహాద్రాజానం చ భయాదథ ।
ఆరాధయేత్పతిం శౌరిం యా పశ్యేత్ సాపతివ్రతా ॥

కార్యే దాసీ రతౌ వేశ్యా భోజనే జననీసమా
విపత్సు మంత్రిణీ భర్తుః సా చ భార్యా పతివ్రతా ॥

భర్తురాజ్ఞాం న లంఘేద్యా మనోవాక్కాయకర్మభిః
భుక్తే పతౌ సదాచాత్తి సా చ భార్యా పతివ్రతా ॥

యస్యాం యస్యాంతు శయ్యాయాం పతిస్స్వపితి యత్నతః
తత్ర తత్ర చ సా భర్తురర్చాం కరోతి నిత్యశః ॥

నైవ మత్సరతాం యాతి న కార్పణ్యం న మానినీ
మానేఽమానే సమానత్వం యా పశ్యేత్ సాపతివ్రతా ॥

సువేషం యా నరం దృష్ట్వా భ్రాతరం పితరం సుతమ్
మన్యతే చ పరం సాధ్వీ సా చ భార్యా పతివ్రతా ॥

(పద్మపురాణ. సృష్టిఖండం. 47/55–60)

ఏ స్త్రీ పుత్రునిపై చూపేప్రేమకంటె నూరు రెట్లు అధికమైన ప్రేమతో పతిని సేవిస్తుందో, మహారాజునకువలె పతికి భయపడే లక్షణం కలిగి ఉంటుందో తన పతిని సాక్షాత్తూ భగవత్స్వరూపునిగా భావన చేస్తుందో

ఆమె పతివ్రత యనబడుతుంది. గృహకృత్యాలను నిర్వర్తించే వేళ దాసిగా, రమణకాలంలో వేశ్యగా, భోజనకాలంలో మాతృమూర్తిగా, విపత్కాలంలో చక్కని సలహాలను అందించు మంత్రిగా ఏ స్త్రీ వ్యవహరిస్తుందో ఆమె పతివ్రత. (మనసా, వాచా, కర్మణా) మనోవాక్కాయకర్మల చేత పతి యాజ్ఞను ఎన్నడూ ఉల్లంఘించకుండ ఉంటూ ఏ స్త్రీ నిత్యమూ భర్త ఏ శయ్యమీద పరున్న ఆ శయ్యమీదనే తగిన విధంగా అతనిని ఆరాధించే స్త్రీ పతివ్రత. పతిని గూర్చి తన మనస్సులో ఈర్ష్యాద్వేషాలకు కాని కార్పణ్యానికి కాని ఏ స్త్రీ కొంచెం కూడ తావు ఈయకుండ చరిస్తుందో, ఏ స్త్రీ అభిమానలక్షణాన్ని ఎన్నడూ ప్రదర్శించకుండ ఉంటూ, భర్త తనయందు ఆదరంచూపినా, అనాదరాన్ని ప్రకటించినా రెండు దశలయందూ ఏ స్త్రీ సమబుద్ధి కలిగి వ్యవహరిస్తుందో ఆమె పతివ్రత. సాధ్వీమతల్లియైన ఏ స్త్రీ సుందరవేషధారియైన పరపురుషుని గాంచి సోదరునిగా, తండ్రిగా, తనయుడిగా భావన చేస్తుందో ఆమె పతివ్రత.

కాబట్టి బ్రాహ్మణవరేణ్యా! మీరు పతివ్రతాస్త్రీని దర్శించండి. ఆమెకు మీయభీష్టమును ఎరిగించండి. ఆమె పేరు శుభ. ఆమె రూపవతియైన యువతి. సదయహృదయురాలు. కీర్తిమంతురాలు. మీరు ఆమె కడకు చేరి మీ అభీప్సితవిషయాన్ని గూర్చి ప్రశ్నించండి.

ఈ విధంగా పలికి భగవానుడు అక్కడనే అంతర్ధానం చెందాడు. అతడు అంతర్హితుడుకాగా చూచి నరోత్తముడు ఆశ్చర్యం పొందాడు. క్రమంగా అతడు పతివ్రత గృహం చేరి ఆమెను సంబోధించాడు. అతిథి సంబోధనాన్ని ఆలకించి ఆమె వెలికి వచ్చి బ్రాహ్మణుని చూచి గుమ్మం దగ్గర నిలువబడింది. బ్రాహ్మణుడు ఆమెను గాంచి అమ్మా! నీవు కన్నదానిని, తెలిసికొన్నదానిని అనుసరించి స్వయంగానే ఆలోచించి నాకు ప్రీతిని, హితమును గలిగించు విషయం ఏదైన ఉపదేశించుమా అని ప్రసన్నతాపూర్వకంగా ప్రార్థించాడు.

అప్పుడు ఆమె, విప్రవర్యా! ఇప్పుడు నా పతిదేవుని సేవించుకోవలసిన కార్యభారం నామీద ఉన్నది. ఇప్పుడు నాకు అవకాశం

లేదు. ఆ పని ముగిసిన మీదటనే నేను మీతో మాట్లాడగలను. అంతవరకు వేచియుండండి. ప్రస్తుతం నా ఆతిథ్యం స్వీకరించండి. అని బదులు పలికింది.

తల్లీ! నాకు ఇప్పుడు ఆకలిదప్పుల బాధకాని, అలసటబాధ కానిలేదు. నాకు ఇప్పుడే అభీష్టవిషయమును ఎరిగింపుమా. లేకున్న నిన్ను శపించివైచెదను అని నరోత్తముడు ప్రతివాదం చేశాడు.

అంతట ఆ పతివ్రత యిలా బదులు పలికింది— బ్రాహ్మణోత్తమా! మీ శాపంచేత దగ్ధురాలను అగుటకు నేను కొంగను కాను. మీరు ధర్మతులాధారుని కడకు వెడలండి. అతనిని అడిగి మీ అభీష్టవిషయం తెలుసుకోండి. ఈ విధంగా పలికి ఆమె గృహంలోపలకు వెడలిపోయింది. అప్పుడు నరోత్తమునకు చండాలుని యింటిలోవలెనే యీ పతివ్రత యింటిలో కూడ బ్రాహ్మణవేషధారి యగు భగవానుడు కన్పించాడు.

అతనిని చూచి ఆశ్చర్యం పొంది నరోత్తముడు ఏమో ఆలోచించుకొని ఆ భగవానుని సమీపానికి అరిగాడు. గృహంలోపల ప్రవేశించగా అతనికి పతివ్రతాస్త్రీయు, ఆమె భర్తయు సంతోషపూరితస్వాంతులై కన్పించారు. వారిని చూచిన మీదట నరోత్తముడు భగవానునితో ప్రశ్నపూర్వకంగా ఇలా అన్నాడు, తండ్రీ! నా వస్త్రములు ఆకాశంలో ఉండగా ఆరిపోవడం. నా శాపంచేత కొంగ భస్మం కావడం మొదలైన నా విషయాలు ఇతరప్రదేశంలో సంభవించిన సంఘటనలు, నేను చెప్పకుండ ఆ విషయాలు వీరికె ఎట్లు తెలిసినవి? వానిని ఈ పతివ్రత ఎలా చెప్పగలిగింది ఇంతకు ముందు చండాలుడు చెప్పినాడు. ఈ విషయంతో నాకు ఎంతో ఆశ్చర్యం కలుగుతోంది. ఇంతకంటె మహాశ్చర్యం వేరుగా ఏమి ఉంటుంది?

అనగా విని భగవానుడు మరల – విప్రవర్యా! మహాత్ములైనవారు విశేషపుణ్యబలంచేతను, సదాచారసంపద ప్రభావం చేతను అనాయాసంగా సర్వకారణాలను తెలుసుకోగలరు. వారు అలా తెలుసుకోగలగడం ఇతరులకు ఆశ్చర్యకారణం అవుతుంది. ఇంతకు మీకు పతివ్రత ఏమి

బదులు చెప్పినది? అని నరోత్తముని ప్రశ్నించాడు.

ఆమె నన్ను తులాధారుని కడకు పోయి అతనిని అడగండి. అని బదులు చెప్పినది అని నరోత్తముడు అన్నాడు.

అట్లయిన రండు! మునివర్యా! నేను ఆ తులాధారుని దగ్గరకు వెళుతున్నాను అని భగవానుడు పలికాడు. బయలుదేరుతూ ఉన్న భగవానుని గాంచి ఆతులాధారుడు ఎక్కడ ఉంటున్నాడు? అని నరోత్తముడు ప్రశ్నించాడు.

అప్పుడు భగవానుడు ఇలా అన్నాడు – జనసమ్మర్థం అధికంగా ఉండి విస్తారంగా వస్తువిక్రయాలు జరిగే బజారులో తులాధారుడు ఇందందు క్రయవిక్రయాలు చేస్తూ ఉంటాడు. అతడు వైశ్యుడు. అతడు మనసా, వాచా, కర్మణా ఎన్నడూ ఎవ్వరికినీ ఎట్టి హానిని కలిగించలేదు. అసత్యం ఆడలేదు. దౌష్ట్యానికి పాల్పడలేదు. అతడు ఎల్లరకూ హితం చేకూరుస్తూ ఉంటాడు. అందరియందూ సమబుద్ధి కలిగి ఉంటాడు. మంటి బెడ్డను, బంగారాన్ని సమంగా భావిస్తాడు. జనులు యవధాన్యమూ, నూనె, నేయి, లవణము, ఇతరధాన్యాలను, అన్యవస్తువులను అతని మాటకు కట్టుబడే క్రయవిక్రయాలు చేస్తూ ఉంటారు. ప్రాణం పోయే పరిస్థితి ప్రాప్తించినా అతడు అబద్ధం ఆడడు. ధర్మబద్ధంగా వ్యాపారం చేసేవాడు కావడం చేత జనులు అందరూ అతనిని ధర్మతులాధారుడు అంటారు.

భగవానుడు ఇలా చెప్పిన మీదట నరోత్తముడు అచ్చటనుండి క్రమంగా కదలిపోయి నానావిధ రసవిక్రయం సాగిస్తూ ఉన్న ఆ తులాధారుని దర్శించాడు. అతడు అమ్మకపు వస్తువులను గూర్చి మాటలాడుతూ ఉన్నాడు. ఎందరో స్త్రీలు, పురుషులు అతనిని చుట్టుముట్టి యున్నారు. ఆ సమయంలో తన ముందుకు వచ్చిన నరోత్తముని చూచి అతడు బ్రాహ్మణోత్తమా! ఇలా విచ్చేసితిరేల? అని సాదరముగా పలుకరించాడు.

"నాకు ధర్మం ఉపదేశించుమా. ఇందులకే నేను నీ చెంతకు

వచ్చినాడను" అని నరోత్తముడు అన్నాడు.

అప్పుడు తులాధారుడు ఇలా అన్నాడు – విప్రవర్యా! నా దగ్గర ఈ జనసమ్మర్ధం ఎంతవరకు ఉంటుందో అంతవరకు నాకు నిశ్చింత కలుగదు. అవకాశం చిక్కదు. జాము రేయి గడచువరకు నా పరిస్థితి ఇలాగే ఉంటుంది. కాబట్టి మీరు నా మాట విని ధర్మాకరుని చెంతకు వెళ్ళండి. అక్కడకు వెళ్ళిన మీదట కొంగ మరణించుట వలన సంభవించిన దోషమూ, ఆకాశంలో వస్త్రం ఆరకపోవడమూ – ఈ అంశాలకు సంబంధించిన రహస్యాలు అన్నీ మీకు తెలియగలవు. ఆ ధర్మాకరుని పేరు అద్రోహకుడు. అతడు బహు ఉత్తముడు. అతని కడకు పొండి. అతడు చేసే ఉపదేశం వలన మీ యభీష్టం నెరవేరుతుంది.

ఈ విధంగా చెప్పి తులాధారుడు తన పనిలో తాను నిమగ్నుడు అయ్యాడు. అప్పుడు నరోత్తముడు బ్రాహ్మణవేషధారియైన భగవానుని – మహాత్మా! ఈ తులాధారుడు చెప్పిన విధంగా నేను ఇప్పుడు అద్రోహకుని వద్దకు వెళ్తాను. కాని నేను అతనిగృహమును ఎరుగను. అతని గృహమెక్కడో నాకెరిగింతురా? అని ప్రశ్నించాడు.

పదండి! నేను కూడ మీ వెంట వస్తున్నాను అని భగవానుడు అన్నాడు. అనంతరం వారు ఇరువురూ ముందుదెసకు సాగుతూ ఉన్నవేళ నరోత్తముడు భగవానునితో – మహాత్మా! ఈ తులాధారుడు దేవతర్పణాలు కాని, ఋషితర్పణాలు కాని, పితృతర్పణాలు కాని ఏవీ చేయడు కదా. అట్టి దశలో ఎక్కడో సంఘటిల్లిన నా విషయాలు ఇతనికి ఎట్లు తెలిసినవి? ఇందువలన నాకు ఎంతో విస్మయం కలుగుతోంది. దీనికి కారణం ఏమందురు? అని అన్నాడు.

అప్పుడు భగవానుడు ఇలా అన్నాడు –

శ్లో. సత్యేన సమభావేన జితం తేన జగత్త్రియమ్
తేనాతృప్యంత పితరో దేవా మునిగణాస్తథా ॥

భూతభవ్యప్రవృత్తం చ తేన జానాతి ధార్మికః
నాస్తి సత్యాత్పరో ధర్మో నానృతాత్పాతకం పరమ్ ॥

(పద్మపురాణం. సృష్టిఖండం 47/92–93)

బ్రాహ్మణవరేణ్యా! అతడు సత్యంతోను, సమత్వబుద్ధితోను త్రిలోకాలనూ జయించాడు. ఆ కారణంగానే అతని యెడల దేవతలు, పితృదేవతలు, మునులునూ ప్రసన్నులై ఉన్నారు. ఈ సుగుణసంపద కారణంగానే ధర్మాత్ముడైన తులాధారుడు భూతభవిష్యద్వర్తమాన విషయాలు అన్నీ తెలుసుకోగలుగు తున్నాడు. సత్యాన్ని మించిన ధర్మమూ, అసత్యాన్ని మించిన పాపమూ వేరొకటి లేదు.

పాపరహితుడూ, సమత్వదృక్పథం కలవాడూ, శత్రువులు, మిత్రులు, ఉదాసీనులూ (తటస్థవైఖరి వహించినవారు) ఈ ముగ్గురియందూ సమానమైన చిత్తవృత్తి కలవాడు అయిన పురుషుడు సమస్తపాపవిముక్తుడు అవుతాడు. అట్టివాడు కడకు మహావిష్ణుసాయుజ్యం పొందుతాడు. సమత్వమే ధర్మం. సమత్వమే ఉత్కృష్టమైన తపస్సు. ఎల్లవేళల ఎవని హృదయంలో సమత్వం నెలకొని ఉంటుందో అతడే ఎల్ల లోకాలలోనూ శ్రేష్ఠుడు. అతడే యోగులలో పరిగణింపబడదగినవాడు. అతడే లోభరహితుడు అవుతాడు.

సర్వదా సమత్వాన్ని పాటించేవాడు తన వంశానికి సంబంధించిన అనేకతరాల వారిని తరింపజేసినవాడు అవుతాడు. వానిలో సత్యమూ, ఇంద్రియనిగ్రహమూ, మనోనిగ్రహమూ, ధైర్యమూ, స్థిరత్వమూ, లోభరాహిత్యమూ, సోమరితనము లేకుండుట మొదలైన సద్గుణాలు ఎన్నో సుప్రతిష్ఠితాలు అవుతాయి. సమత్వం యొక్కప్రభావం చేత ధర్మనిష్ఠ వహించిన పురుషుడు మానవులయు, దేవతలయు లోకాలలోని సమస్తవిషయాలను తెలుసుకోగలుగుతాడు. అట్టివాని శరీరంలో మహావిష్ణు భగవానుడు విరాజిల్లుతూ ఉంటాడు. సత్యమూ, సరళస్వభావమూ మొదలైన శుభగుణాలు సంపదలో లోకంలో అతనికి సాటియైనవారు

ఎవ్వరూ ఉండరు. అతడు సాక్షాత్తూ పరమధర్మస్వరూపుడు. అతడే జగత్తును ధారణం చేయగలవాడు.

ఈ మాటలు విని నరోత్తముడు – మహాత్మా! మీ దయవలన తులాధారుడు సర్వజ్ఞుడు అగుటకు కారణం నాకు తెలిసింది. ఇప్పుడు ఆ అద్రోహకుని వృత్తాంతం ఏదో అదికూడ నాకు ఎరిగించండి. అని మరల భగవానుని ప్రార్థించాడు.

అంతట భగవానుడు ఇలా అన్నాడు – బ్రాహ్మణవరేణ్యా! ఇది పూర్వకాలపు సమాచారం. పూర్వం ఒక రాజకుమారుడు ఉండేవాడు. అతని భార్య కులీనురాలు. సౌందర్యవంతురాలు. నవయౌవనశోభాసంపన్నురాలు. మన్మథుని భార్య రతిదేవియో, ఇంద్రుని భార్య శచీదేవియో అన్న విధంగా ఆమె చూపరుల మనస్సులను హరించగల మహాసౌందర్యసంపదతో విరాజిల్లుతూ ఉండేది. రాజకుమారుడు ఆమెను ప్రాణాధికంగా ప్రేమిస్తూ ఉండేవాడు. ఆమె సౌందర్యానికి తగినట్లు ఆమె పేరు కూడ సుందరియే. ఒకనాడు కార్యభారం కారణంగా రాజకుమారుడు ఆకస్మికంగా కొన్ని రోజుల పాటు భార్యను వీడి దూరదేశమునకు పోవలసివచ్చింది. అప్పుడు అతడు తనతో – అయ్యో! నేనిప్పుడు నా భార్యను వీడి పోవక తప్పదు ఆమె నాకు ప్రాణాధికప్రియతమురాలు. ఆమెను ఎవరి ఆధీనంలో ఉంచి వెళ్ళాలి? ఎక్కడ ఉంచితే ఆమె సతీత్వం (శీలం) చెడకుండ ఉంటుంది? అని తర్కించుకొన్నాడు. బాగుగా ఆలోచించిన మీదట అతనికి అద్రోహకుడు (ఎవరికీ ద్రోహంచేయనివాడు) తలపునకు వచ్చాడు.

వెంటనే అతడు ఆ అద్రోహకుని యింటికి వెళ్లి ప్రియంగా పలుకరించి, నాయనా! నేను దూరప్రాంతాలకు వెళుతున్నాను. దయ వహించి నేను మరలి వచ్చునంతవరకు మహాసౌందర్యరాశియైన నా భార్యను మీ యింటనుంచి రక్షించుమా. అని అతనిని ప్రార్థించాడు. రాజకుమారుని మాట విని అద్రోహకుడు ఆశ్చర్యం పొందాడు. నాయనా! నేను నీకు తండ్రిని కాను. సోదరుడను కాను. చుట్టాన్ని కాను. నీ భార్యయొక్క పితృకులానికి గాని, మాతృకులానికి గాని చెందినవాడను గాను. నీ

మిత్రవర్గంలోనివాడను కూడ కాను. ఇట్టి నా యింట నీ భార్యను ఉంచి నీవు ఎట్లు నిశ్చింతగా ఉండగలవు? అని అతడు రాజకుమారుని ప్రశ్నించాడు.

అంతట మహాత్మా! ఈ లోకంలో నీకు సాటియైన ధర్మజ్ఞుడు జితేంద్రియుడూ అయిన పురుషుడు వేరు ఎవ్వడునూ లేడు. అన్నాడు రాజకుమారుడు.

ఆ మాట విని అద్రోహకుడు - రాజకుమారా! నన్ను క్షమించు నాపై దోషారోపణం చేయవద్దు. ఈ త్రిభువనసౌందర్యరాశిని ఎవరు కాపాడగలరు? నావలన గాదు అని బదులు చెప్పాడు.

"నేను అన్ని విషయాలు కూలంకషంగా ఆలోచించుకొన్న తరువాతనే నీ దగ్గరకు వచ్చాను. ఈమె నీ యింటనే ఉంటుంది. ఇక నేను వెళుతున్నాను" అన్నాడు మరల రాజకుమారుడు.

అప్పుడు అద్రోహకుడు మరల ఇలా అన్నాడు - రాజకుమారా! ఈ సుందరనగరంలో కామాంధులైన మానవులు బహుళంగా ఉన్నారు. ఇక్కడ స్త్రీయొక్క శీలసంరక్షణం దుర్ఘటంగా తోస్తోంది.

ఆ మాట విని రాజకుమారుడు మరల - మహానుభావా! ఎట్లయిన నీవు ఈమెను రక్షింపక తప్పదు. నేను వెళుతున్నాను అని అభ్యర్థించాడు.

అప్పుడు గృహస్థుడైన అద్రోహకుడు ధర్మసంకటంలో పడి మరల ఇలా అన్నాడు -నాయనా! అట్లయితే నేను ఒక మాట చెపుతున్నాను విను. నీ భార్య హితం కోరి ఆమె శీలరక్షణాన్ని దృష్టిలో ఉంచుకొని నేను ఆమెతోడ అనుచితంగా వ్యవహరించుటకు నిశ్చయించుకున్నాను. అలా చేయడమే ఉచితమని నాకు తోస్తుంది. అలా వ్యవహారం సాగినప్పుడే ఆమె నా యింటిలో సురక్షితంగా ఉండగలుగుతుంది. అలా కాదంటే ఈ అరక్ష్యను రక్షించుటకు నీవే ఏదైన ఉపాయం తెలియజెప్పు. నేను ఈమెతోడ వ్యవహరించే అనుచితవిధం ఎట్టిది అంటే నా శయ్యమీద నాకు ఒక ప్రక్క

నా భార్య శయనించి యుండగా రెండవ ప్రక్క ఈమె పరుండాలి. అట్లు పడుకొంటూ ఉన్నా నీవు మరలి వచ్చిన మీదట ఎట్టి శంకలు, సందేహాలు లేకుండ సహర్షంగా ఈమెను నీ భార్యగా స్వీకరించాలి. అలా చేయడం నీకు సమ్మతం అయితేనే ఈమెను ఇక్కడ ఉంచు, కాదంటే ఇప్పుడే ఈమెను నీ యిచ్ఛవచ్చిన చోటికి తీసుకొనిపో!.

అతని మాటలు విని రాజకుమారుడు క్షణకాలం ఏమో ఆలోచించుకొని ఆర్యా! నీవు చెప్పిన విధం నాకు సమ్మతమే. నీకు ఎలా చేయడం అనుకూలంగాతోస్తే అలాగే చేయి! అని అద్రోహకునితో చెప్పి తన భార్యవంకకు తిరిగి - దేవీ! నీవు ఇతడు ఎలా చెపితే అలా చేస్తూ ఉండు, నిన్ను ఏ దోషమూ అంటదు. ఇది నీకు నా ఆదేశం. అని ఆమెతో చెప్పాడు. అనంతరం అతడు తన తండ్రి యాదేశానుసారం తాను వెళ్లవలసిన స్థానానికి బయలుదేరి వెళ్ళిపోయాడు.

అటు పిమ్మట అద్రోహకుడు రాజకుమారునితో చెప్పిన విధంగానే చేశాడు. ఆ ధర్మాత్ముడు ప్రతిదినమూ ఇరువురు స్త్రీల నడుమ శయనింపనారంభించాడు. అయినా పరస్త్రీ తన ప్రక్కలో ఉన్నా అతడు ధర్మంనుండి ఎన్నడూ విచలితుడు కాలేదు. తన భార్యను స్పృశించినప్పుడు మాత్రమే అతనిలో కామోపభోగకాంక్ష ఉదయించేది. రెండవప్రక్క రాజకుమారుని భార్య స్తనద్వయం తన వీపునకు తగులుతూ ఉన్నా ఆమె యెడల అతని చిత్తవృత్తి తల్లిస్తనాలను స్పృశించే చంటిబిడ్డ చిత్తవృత్తిని పోలియే ఉంటూ వచ్చింది.

అతడు దినదినమూ ఆమె యెడల మాతృభావాన్ని బలపరచుకుంటూ వచ్చాడు. క్రమంగా అతనిలో స్త్రీవాంఛ క్షీణించిపోతూ వచ్చింది. ఈ విధంగా ఆరుమాసాల కాలం అతిక్రమించిన మీదట రాజకుమారుడు దూరదేశంనుండి వెనుకకు మరలి అద్రోహకుని నగరం చేరాడు. అతడు తన భార్యప్రవృత్తిని గూర్చి అద్రోహకుని ప్రవృత్తినిగూర్చి ప్రజల అభిప్రాయాలను విచారించి తెలుసుకొన్నాడు. ప్రజలు కూడ తమతమ అభిప్రాయాలను తమ అభిరుచులను బట్టి భిన్నభిన్నంగా ప్రకటించారు.

రాజకుమారుడు చేసిన వ్యవస్థను ఎరిగి కొందరు మెచ్చుకొన్నారు. కొందరు ఆశ్చర్యాన్ని వెల్లడించారు.

మరికొందరు – నాయనా! నీవు నీ భార్యను అతనికి యథేచ్ఛగా అప్పగించివేసావు. అతడు ఆమెను తన ప్రక్కలో పండుకొనబెట్టు కుంటున్నాడు. స్త్రీ పురుషుల నడుమ సన్నిహితసంబంధం ఏర్పడినప్పుడు వారి మనస్సులు ప్రశాంతంగా ఎలా ఉండగలుగుతాయి? అని వ్యాఖ్యానించారు. అద్రోహకుడు తన ధర్మనిష్ఠాబలంతో జనులు తనను గూర్చి చేస్తూఉన్న చర్చలను, నిందలను తెలిసికొన్నాడు. అప్పుడు అతనిలో ఈ లోకాపవాద వలయంనుండి బయల్పడాలన్న సంకల్పం ఉదయించింది. అతడు పెద్ద మొత్తంగా కర్రలను తెప్పించి స్వయంగా చితిని సిద్ధం చేసుకొని దానికి నిప్పుముట్టించాడు. చితి ప్రజ్వరిల్లింది. ఆ సమయానికే రాజకుమారుడు అక్కడకు వచ్చాడు. అక్కడ అద్రోహకుని తన భార్యను అతడు చూశాడు. భార్య ముఖం సుప్రసన్నంగాను, అద్రోహకుని ముఖం విషాదభరితంగాను ఉండగా అతడు పరికించాడు. వారి ఇరువురి మానసిక పరిస్థితులను అర్థం చేసుకొని రాజకుమారుడు –మిత్రమా! నేను నీ మిత్రుడను. చాలాకాలం గడచిన మీదట ఇక్కడకు వచ్చాను. నీవు నాతో మాటలాడవేమి? అని అద్రోహకుని పలుకరించాడు.

మిత్రమా! నీ హితం కోరి నేను దుష్కర్మం చేసాను. నేను చేసిన ఈ చేష్ట లోకాపవాదం కారణంగా నిరర్థకం అయిపోయింది. కాబట్టే తద్దోషపరిహారార్థం నేను అగ్నిప్రవేశం చేస్తున్నాను. దేవతలు, మానవులు నా యీ ప్రయత్నాన్ని పరికించెదరు గాక. అని అద్రోహకుడు రాజకుమారునకు బదులు చెప్పాడు.

అనంతరం ఆ అద్రోహకుడు సానందంగా అగ్నిప్రవేశం చేశాడు. కాని, అగ్నిదేవుడు అతని శరీరాన్ని, వస్త్రాన్ని కేశాలను ఏమాత్రమూ దగ్ధం చేయలేకపోయాడు. ఆ సమయంలో ఆకాశంలో నిలిచిదేవతలు మేలు! మేలు! భళి! భళి! అనే ప్రశంసావచనాలతో కోలాహలం చేశారు. నాలుగు వంకలనుండియు అద్రోహకుని తల మీద పూలవానలు కురిశాయి.

రాజకుమారుని భార్యను అవలంబంగా చేసుకొని అతనిని నిందించినవారి ముఖాలపై కుష్ఠువ్యాధి ఉదయించింది. దేవతలు అక్కడకు చేరి అగ్నినుండి అతనిని వెలికి తీసుకొనివచ్చి దివ్యపుష్పాలతో పూజించారు. అతని చరిత్రమును ఆలకించి మహర్షులు కూడ విస్మయం పొందారు. ఎల్లరు మునీశ్వరులు, ఎల్ల వర్ణాల మానవులు మహాతేజశ్శాలి, మహాభాగుడూ అయిన ఆ అద్రోహకుని అనేకవిధాల పూజించి గౌరవించారు. అతడు స్వయంగా కూడ వారికి ఎల్లరకూ ఆదరసత్కారాలు గావించాడు. అప్పుడు దేవ దానవ మానవులు ఎల్లరునూ గూడి అతనికి సజ్జనాద్రోహకుడు అని పేరు పెట్టారు.

అతని పాదధూళి సోకినమేర భూమి సస్యశ్యామలమయ్యేను. ఆ సమయంలో దేవతలు రాజకుమారునితో ఇలా అన్నారు – నాయనా! రాజకుమారా! నీవు నీ భార్యను సానందంగా స్వీకరించు ఈ అద్రోహకుని వంటి పురుషుడు లోకంలో ఇంతవరకు వేరొకడు జన్మించియుండలేదు. ఈతనివలె కామాన్ని, లోభాన్ని జయించిన పుణ్యపురుషుడు వేరొకడు ఇప్పుడు ఈ భూమండలం మీద లేడు. ఉన్నవారు అందరూ కామవృత్తిచేత, లోభవృత్తి చేత పరాజితులైనవారే. దేవతలకేమి? అసురులకేమి? మానవులకేమి, రాక్షసులకేమి, పశువులకేమి? పక్షులకేమి? కీటకాదిప్రాణివర్గమున కేమి ఈ కామప్రవృత్తి అత్యంత దుర్జయమైనది. జీవుడు జననమరణవలయంలో చిక్కి పరిభ్రమిస్తూ ఉండడానికి ఈ కామ క్రోధ లోభవృత్తులే ప్రధానకారణాలు. కామమే జీవుని సంసారబంధంలో బంధించేది. ఇంచుమించుగా ఎందునూ లేశమాత్రం అయినా కామప్రవృత్తిలేని మానవుడు ఉండడు. అట్టివాడు దొరకుట దుర్లభము. ఈ అద్రోహకుడు ప్రబలములైన ఆ ప్రవృత్తులను అన్నిటినీ జయించివేసిన వీరవరుడు. ఆ ప్రవృత్తులపై విజయము సాధించుటతో ఇతడు చతుర్దశభువనాల మీద విజయం సాధించినవాడు అయ్యాడు. పరమప్రసన్నతతోడ ఈతని హృదయమందిరంలో భగవానుడగు వాసుదేవుడు సర్వదా విరాజిల్లుతూ ఉంటాడు. ఈ పుణ్యపురుషుని స్పృశించిన, దర్శించిన మానవులు సమస్తపాపతాపవిముక్తులై అక్షయస్వర్గసుఖములను అందుకొంటారు.

ఈ విధంగా పలికి దేవతలు అందరూ తమతమ విమానాలను అధిరోహించి సానందంగా స్వర్గలోకానికి వెడలిపోయారు. అచ్చట చేరిన జనులు అందరూ తమతమ నెలవులకు వెడలిపోయారు. రాజకుమారుడు అతని భార్య తమ రాజభవనం దిక్కుగా సాగిపోయారు. నాటినుండి అద్రోహకునకు దివ్యదృష్టి ప్రాప్తించింది. అతడు దేవతలను కూడ చూడగలడు. మూడులోకాలలోని సమాచారాలను అనాయాసంగా తెలుసుకోగలడు.

ఈ విధంగా బ్రాహ్మణవేషధారియైన భగవానుడు తెలుపగా నరోత్తముడు అద్రోహకుని ఉదంతం ఆలకించాడు. అనంతరం అతడు క్రమంగా ఆ అద్రోహకుడు ఉంటూ ఉన్న వీధిలోనికి అరిగి అతనిని సందర్శించాడు. ఎంతో సంతోషంతో పలుకరించి తనకు హితకరవిషయాలు తెలుపుతూ ధర్మోపదేశం చేయమని అతనిని కోరాడు.

అప్పుడు సజ్జనాద్రోహకుడు ఇలా అన్నాడు – బ్రాహ్మణోత్తమా! మీరు పురుషశ్రేష్ఠుడైన వైష్ణవుని దగ్గరకు వెళ్ళండి. ఆ మహాభాగుని దర్శిస్తే మీ మనోరథం సిద్ధిస్తుంది. కొంగ మరణం, ఆకాశంలో పూర్వంలో వలె వస్త్రం ఆరకపోవడం మొదలైనవాని కారణాలు మీకు తెలియవస్తాయి. ఇంకను మీ హృదయంలో ఉన్న కోరికలు అన్నీ ఫలిస్తాయి.

ఆ మాటలు విని నరోత్తముడు బ్రాహ్మణవేషధారియైన భగవానుని వెంట సహర్షంగా అచ్చటనుండి కదలి అద్రోహకుడు తెలిపిన వైష్ణవుని తావునకు వెడలినాడు. అచ్చట ఆ మహాపురుషుని సందర్శించాడు. ఆ వైష్ణవుడు పరిశుద్ధహృదయంతో, అసాధారణతేజస్సుతో సమస్త శుభలక్షణ సంపదతో విరాజిల్లుతూ ధ్యానమగ్నుడై ఉన్నాడు. అతనిని గాంచి మహాత్మా! నేను బహుదూరంనుండి మీ సన్నిధికి వచ్చాను. నాకు ఏది కర్తవ్యం అవుతుందో విశదంగా తెలియజేయండి. అని నరోత్తముడు సవినయంగా అభ్యర్థించాడు.

అంతట ఆ వైష్ణవోత్తముడు – నాయనా! దేవదేవుడైన భగవానుడు

శ్రీమహావిష్ణువు నీయెడల ప్రసన్నుడై యున్నాడు. ఇప్పుడు నిన్ను చూడగా నా హృదయం అమందానంద సంభరితం అవుతోంది. కాబట్టి నీకు ఉపమింపరాని శుభం చేకూరుతుంది. ఈ నాడు నీ మనోరథం ఫలిస్తుంది. నా యింట భగవానుడు శ్రీమహావిష్ణువు విరాజిల్లుతున్నాడు. అని బదులు చెప్పాడు.

అప్పుడు నరోత్తముడు మరల – మహాత్మా! భగవానుడు శ్రీమహావిష్ణువు ఇక్కడ ఎక్కడ ఉన్నాడు? వెంటనే నాకు ఆ స్వామి దర్శనం గలిగింపరా? అని ప్రార్థించాడు.

నా యింటిలో సుందరమైన దేవమందిరం ఉంది. అందు ఆ స్వామి వెలుగొందుతూ ఉన్నాడు. పోయి దర్శించు. దర్శిస్తే జననమరణ బంధనకారణాలైన మహాపాతకాలనుండి నీకు విముక్తి లభిస్తుంది అని వైష్ణవుడు అన్నాడు.

అంతట నరోత్తముడు ఆ దేవమందిరంలో ప్రవేశించి చూచాడు. ఇంతవరకు తనవెంట బ్రాహ్మణవేషంలో ఉన్న భగవానుడే అందు కమలాసనంపై విరాజిల్లుతూ ఉన్నాడు. నరోత్తముడు చేరువకు అరిగి శిరము వంచి నమస్కరించి ఆ దేవదేవుని చరణాలను తన రెండు చేతులతోనూ పట్టుకొని – దేవదేవా! నా యెడల ప్రసన్నులు కండి. ముందు నేను మిమ్ము గుర్తింపలేకపోయాను. ప్రభూ! ఇహమందు, పరమందు కూడ మీకింకరుడనై సర్వదా చరించే విధంగా నన్ను అనుగ్రహించండి. నాపై మీకు పరమానుగ్రహం ఉన్నట్లు ప్రత్యక్షంగా తెలుసుకొన్నాను. నాయందు కృపజూపి ఒక్క మారు మీ నిజదివ్యరూపం చూపి నన్ను కృతకృత్యుని గావించండి అని ప్రార్థించాడు.

అప్పుడు విష్ణుభగవానుడు ఇలా అన్నాడు – బ్రాహ్మణవరేణ్యా! నీపై నాకు విశేషప్రేమ ఎప్పుడూ ఉంది. ఆ కారణంగానే నేను నీవెంట వుండి నీకు పుణ్యపురుషుల దర్శనం కలుగజేశాను.

శ్లో. దర్శనాత్ స్పర్శనాద్ధ్యానాత్ కీర్తనాద్భాషణాత్తథా ।
సకృత్పుణ్యవతామేవ స్వర్గం చాక్షయమశ్నుతే ॥

నిత్యమేవ తు సంసర్గాత్ । సర్వపాపక్షయో భవేత్ ।
భుక్త్వా సుఖమనంతం చ మద్దేహే ప్రవిలీయతే ॥

(పద్మపురాణం. సృష్టిఖండం 47/162–63)

పుణ్యాత్ములైన మహాపురుషుల సంస్పర్శము, సందర్శనమూ, ధ్యానమూ, నామోచ్చారణమూ, వారితో సంభాషణము ఒక్కమారు చేసిన మానవుడు అక్షయమైన స్వర్గసుఖాన్ని అందుకుంటాడు. మహా పురుషులతోడ నిత్యసాంగత్యం పెట్టుకుంటే సర్వపాపక్షయం అవుతుంది. బ్రతికి యున్నంత కాలమూ అనంతమైన సుఖాన్ని అనుభవించి కడపట మానవుడు నాలో విలీనుడు అవుతాడు.

పుణ్యతీర్థాలలో స్నానం ఆచరించి శంకరమహాదేవుని, పుణ్యపురుషుల ఆశ్రమాలను సందర్శించే మనుష్యుడు కూడ అంతమందు నాలో లయమును పొందుతాడు. నా పుణ్యదినం అయిన ఏకాదశినాడు ఉపవాసం ఆచరించి పరమపవిత్రమైన నా చరిత్రను ప్రవచనం చేసిన మహాభాగుడు కూడ అంతమందు నా స్వరూపంలో విలయం చెందుతాడు. రేయి అంతా నా చరిత్రను ఆలకిస్తూ జాగారం చేసినవాడు కూడ నాలో లయించిపోతాడు. విప్రవరేణ్యా! నిత్యమూ భావరాగతాళాలతో నా నామసంకీర్తనం చేస్తూ గానం చేసేవాడు కూడ నాలో లయమొందుతాడు. మానసికంగా తాపసులకు, మహారాజులకూ, గురుజనులకూ ద్రోహం తలపెట్టనివాడు కూడ నాలో ఐక్యం చెందుతాడు. నాయనా! నీవు నా భక్తుడవు. తీర్థస్వరూపుడవు. అయినా నీవు శపించి కొంగ మరణానికి కారణం అయ్యావు. ఆ దోషం పోవడానికి నేనే అక్కడ ఉండి, పుణ్యాత్ములలో అగ్రగణ్యుడూ, తీర్థస్వరూపుడూ అయిన మూక చండాలుని చెంతకు పొమ్మని ఆకాశవాణి మూలంగానీకు తెలియజెప్పాను.

ఆ మహాభాగుని సందర్శించి అతడు ఎంత భక్తితో ఎలా తన మాతాపితరులను సేవిస్తూ ఉన్నాడో నీవు చూచావుకదా? ఆ పుణ్యపురుషులను ఎల్లరనూ దర్శించడం వలన, వారితో సంభాషణ సాగించడం వలన, వారితో సంపర్కం కలిగించు కోవడంవలన, నా వెంట ఉండడం వలన నీవు ఈనాడు నా మందిరంలోనికి రాగలిగావు. కొన్ని కోట్ల జన్మలు గడచిన మీదట ఎట్లో మానవుడు పాపవిముక్తిని పొందడమూ, అట్లు పాపరాహిత్యం పొందిన పుణ్యపురుషుడు నన్ను సందర్శించగలగడమూ, తద్వారా అతడు ప్రసన్నత పొందడమూ సంభవం అవుతుంది. వత్సా! నా అనుగ్రహంవలననే నీకు నా దర్శనం లభించింది. కాబట్టి నీకు ఇష్టమైన వరం ఏదయినా కోరుకో.

భగవానుడు ఆడిన యీ మాటలను ఆలకించి నరోత్తముడు మరల – నాథా! సమస్తమైన జగత్తుకి ఆధారభూతుడా! నా మనస్సు సర్వవిధాల మీ ధ్యానంలోనే నిమగ్నమై ఉంటూ ఉండాలి. దీనజన బాంధవా! రమాధవా! మీరు తప్పమరి యే వస్తువూ నాకు రుచించకుండ ఉండాలి. అలా నన్ను అనుగ్రహించండి, అని ప్రార్థించాడు.

అప్పుడు భగవానుడు మరల ఇలా అన్నాడు – ఓయి పుణ్యాత్మా! బ్రాహ్మణోత్తమా! నీ బుద్ధిలో ఎల్లప్పుడూ ఇలాంటి ఉత్తమభావాలే ఉదయిస్తూ ఉంటాయి. భవిష్యత్తులో నీవు నా ధామానికి చేరి నావలెనే దివ్యభోగాలను అనుభవించగలవు. కాని నీ మాతాపితరులు నీవలన ఆదరం లభించక బాధపడుతూ ఉన్నారు. కాబట్టి ముందుగా వారి దగ్గరకు చేరి భక్తితో వారిని ఆరాధించు! అనంతరం నా స్వరూపాన్ని పొందగలవు. నీ మాతాపితరులకు నీపై కలిగిన క్రోధం కారణంగాను, దుఃఖాతిరేకంతో ఉస్సురని వారు విడిచే నిట్టూర్పుల కారణంగాను దినదినమూ నీతపస్సు క్షయం అయిపోతూ ఉంది.

శ్లో. మన్యుర్నిపతతే యస్మిన్ పుత్రే పిత్రోశ్చ నిత్యశః
తన్నిరయంన బాధేవహం న ధాతా న చ శంకరః
(పద్మమపురాణం. సృష్టిఖండం 47\178)

లోకంలో మాతాపితరులు ఏ కుమారుని మీద ఎల్లవేళల క్రోధం వహించి ఉందురో వానిని నరకంలో పడకుండ నేను కాని, బ్రహ్మకాని, శంకరుడు కాని రక్షింపలేరు. కాబట్టి నాయనా! నీవు నీ మాతాపితరుల దగ్గరకు వెళ్లి ప్రయత్నపూర్వకంగా వారిని నిండు భక్తితో పూజిస్తూ ఉండు. అలా చేస్తే వారి పరమానుగ్రహంవలన నీకు నా పరమపదం ప్రాప్తిస్తుంది.

భగవానుడు ఈ విధంగా చెప్పగా విని బ్రాహ్మణశ్రేష్ఠుడైన నరోత్తముడు మరల ఇలా అన్నాడు - స్వామీ! నా యెడల మీకు ప్రసన్నత గలిగినచో ఒక్కమారు నాకు మీ దివ్యరూపాన్ని సాక్షాత్కరింపజేయండి.

అనగా విని సమస్తలోకాలకు కర్తయు, బ్రాహ్మణుల క్షేమం కోరేవాడును అయిన భగవానుడు ప్రసన్నుడై పుణ్యాత్ముడైన ఆ నరోత్తమునకు శంఖ చక్ర, గదా, పద్మధారియై తన పురుషోత్తమస్వరూపాన్ని సాక్షాత్కరింపజేశాడు. ఆ దేవదేవుని తేజస్సుతో జగత్తు అంతా ఉద్భాసితం అయింది. నరోత్తముడు దండమువలె ఆ స్వామి ముందు నేలమీద వ్రాలి సాష్టాంగ నమస్కారం గావించి యిలా అన్నాడు - జగదీశ్వరా! దయానిధానా! దామోదరా! ఈ నాడు నా జన్మ ధన్యం అయింది. నా కన్నులు చరితార్థములు అయ్యాయి. నా పూర్వజులు సనాతన బ్రహ్మలోకములు చేరినారు. మీ దయవలన నా బంధుబాంధవులు ఎల్లరూ అమందానందాన్ని అందుకున్నారు. నా మనోరథాలు అన్నీ ఇప్పుడు సిద్ధించాయి.

కాని స్వామీ! ఆ మూకచండాలుడు మొదలైన జ్ఞానులైన మహాపురుషుల విషయంలో నాకు పరమాశ్చర్యం కలుగుతోంది. ఎక్కడ ఎప్పుడో దూరప్రదేశాలలో జరిగిన సంఘటనలను వారు ఎలా తెలుసుకోగలుగుతున్నారు? అన్నదే నా ఆశ్చర్యానికి కారణం. మీరు మూకచండాలుని యింట అత్యంతసుందర బ్రాహ్మణరూపం దాల్చి విరాజిల్లుతూ ఉన్నారు. ఆ రూపంతోనే పతివ్రత యింటిలోను, తులాధారుని ఇంటియందూ, మిత్రద్రోహానికి పాల్పడనివాడైన అద్రోహకుని యింటిలోను, ఇక్కడ ఈ విష్ణుభక్తశిఖామణి మందిరంలోను కూడ

విరాజిల్లుతూ ఉండగా నేను మిమ్ము దర్శించాను. ఈ విషయాలు అన్నిటిలోనూ మౌలికంగా ఉన్న రహస్యమేమియో దయ చేసి నాకు తెలుపగోరుచున్నాను.

నరోత్తముడు ఆడిన మాటలను ఆలకించి విష్ణుభగవానుడు మరల ఇలా చెప్పాడు. విప్రోత్తమా! మూకచండాలుడు సర్వదా మాతాపితృభక్తి తత్పరుడై ఉంటున్నాడు. శుభాదేవి పతివ్రత. తులాధారుడు సత్యనిష్ఠ, సర్వసమత్వమూ కలవాడు. అద్రోహకుడు లోభవృత్తిమీద, కామవృత్తిమీద విజయం సాధించినవాడు. వైష్ణవుడు నా యందు అనన్యమైన భక్తి నిష్ఠగలవాడు. ఈ సద్గుణాల కారణంగానే నేను వారి అందరి యిండ్లలోనూ సానందంగా నివసిస్తూ ఉన్నాను. నాతోబాటు సరస్వతీదేవి, లక్ష్మీదేవి కూడ వీరి యిండ్లలో నివసిస్తూ ఉన్నారు. మూకచండాలుడు మూడు భువనములవారికి శుభమును చేకూర్చగలవాడు. చండాలయోనివాడు అయినా సదాచారసంపన్నుడగుటచే దేవతలు వానిని బ్రాహ్మణునిగా భావిస్తారు. పుణ్యకర్మాచరణంలో మూక చండాలునకు సాటియైనవాడు ఈలోకంలో వేరెవ్వడూ లేడు. అతడు సర్వదా మాతాపితృభక్తి పరాయణుడై ఉంటాడు. ఆ భక్తిబలంతో అతడు త్రిభువనవిజేత అయ్యాడు. అతని మాతాపితృభక్తిని చూస్తే నాకు ఎంతో సంతోషం కలుగుతుంది. ఆ కారణంగానే సమస్తదేవతలతోను కూడి నేను వాని యింట బ్రాహ్మణరూపంలో ఆకాశంలో ప్రకాశిస్తూ ఉన్నాను. ఆ విధంగానే పతివ్రత యింటిలోను, తులాధారుని గృహంలోను, అద్రోహకుని యింటిలోను, ఈ విష్ణుభక్తుని యింటిలోను కూడ నిత్యనివాసం చేస్తున్నాను. క్షణం కూడ నేను వారి యిండ్లను విడిచిపెట్టడం లేదు. పుణ్యాత్ములైన వారు మాత్రమే నన్ను నిత్యమూ దర్శింపగలుగుతారు. పాపాత్ములు దర్శింపలేరు. నీవు నీ పుణ్యప్రభావము చేత, నా అనుగ్రహబలంచేత నా దర్శనం పడయగలిగావు. ఇప్పుడు నేను వరుసగా ఆ మహాపురుషుల సదాచారసంపదను వివరిస్తున్నాను.

విను! అట్టి విషయాలను ఆలకిస్తే మానవుడు సర్వవిధాల జననమరణ బంధంనుండి విముక్తుడు అయిపోతాడు. దేవతలలో కూడ మాతాపితరులను

మించిన తీర్థంలేదు. మాతాపితరులను పూజించిన వాడు ఎవడో వాడే పురుషశ్రేష్ఠుడు. వాని హృదయంలో నేనూ, నా హృదయంలో వాడూ నెలకొని ఉంటాము. మాకు ఇరువురకూ నడుమ తారతమ్యం లేదు. ఇహపరాలు రెండింటియందూ అతడు నావలెనే పూజ్యుడు. అంతమందు అతడు తన సమస్తబంధువర్గంతోను కూడి నా సుందరధామానికి చేరి నాలో లయం చెందుతాడు. తన మాతాపితరుల ఆరాధనవలన ప్రాప్తించిన పుణ్యసంపద బలంతో అతడు మూడు లోకాల విషయాలను తెలుసుకోగలుగుతున్నాడు. మరి యీ విషయంలో నీకు ఆశ్చర్యం ఎలాకలుగుతుంది?

ఈ విషయాలన్నీ ఆలకించి నరోత్తముడు మరల – జగదీశ్వరా! మోహమూ, అజ్ఞానం కారణంగా ఆదిలో మాతాపితరుల సేవాకార్యక్రమాన్ని ఉపేక్షించి అనంతరకాలంలో మంచి చెడ్డల పరిజ్ఞానం పొందిన మానవుడు మరల తన మాతాపితరులను సేవించుకోవాలని అనుకుంటే వాని కర్తవ్యం ఏమి? ఈ విషయం నాకు తెలియజెప్పండి స్వామీ. అని ప్రార్థించాడు.

అప్పుడు భగవానుడు మరల ఇలా వివరించాడు –

శ్లో. దినైకం మాసపక్షం వా పక్షార్ధం వాపి వత్సరమ్।
పిత్రోర్భక్తిః కృతా యేన స చ గచ్ఛేన్మమాలయమ్ ॥

(పద్మపురాణం. సృష్టిఖండం 47/208)

విప్రోత్తమా! ఒక సంవత్సరమో, ఒక మాసమో, ఒక పక్షమో, ఒక వారం రోజుల కాలమో కడకు ఒక దినమో తన మాతాపితరులమీద భక్తిని చూపినవాడు నా ధామాన్ని పొందుతాడు. ఎట్లైన మాతాపితరులమీద భక్తిని చూపడం ప్రధానాంశం.

వారిని పూజించడానికి బదులు క్షోభలపాలు చేసినవాడు నరకాన్ని పొందుతాడు. ఆదిలో వారిని పూజించినా, పూజించకున్నా, వారి మరణానంతరం వారి ఊర్ధ్వగతిని కోరి వృషోత్సర్జనం (అచ్చువేసి

ఆబోతును విడుచుట) గావించినవానికి మాతాపితృభక్తి ఫలం(ప్రాప్తిస్తుంది. తన సర్వస్వాన్ని అర్పించి మాతాపితరులకు శ్రాద్ధాదివిధులను ఆచరించినవాడు జాతిస్మరుడు అవుతాడు. (పూర్వజన్మ జ్ఞానం గలవాడు జాతిస్మరుడు.) అతనికి మాతాపితృభక్తికి సంబంధించిన పరిపూర్ణఫలం ప్రాప్తిస్తుంది. మూడులోకాలలోనూ శ్రాద్ధాన్ని మించిన యజ్ఞం వేరొకటి లేదు. శ్రాద్ధకాలంలో చేసిన దానం అక్షయఫలాన్ని ఇస్తుంది. అన్యులకు చేసిన దానం 10 రెట్లు అధికఫలాన్ని చేకూరుస్తుంది. తనజాతివారికి చేసిన దానం లక్ష రెట్లు, పిండదానకాలంలో అర్పించినది కోటిరెట్లు, బ్రాహ్మణునకు అర్పించినది లెక్క పెట్టలేనన్ని రెట్లు అధికఫలాన్ని సమకూరుస్తుంది. గంగాజలమందు, గయ, ప్రయాగ, పుష్కరక్షేత్రము, కాశీ, సిద్ధకుండము, గంగాసాగరసంగమం మొదలైన పుణ్యతీర్థాలలో పితరులను ఉద్దేశించి అన్నదానం చేసినవానికి ముక్తి లభిస్తుంది. వాని పితరులు అక్షయస్వర్గసుఖాలను పొందుతారు. అలా అన్నదానం చేసినవాని జన్మధన్యం అవుతుంది.

గంగా నదిలో పితరులను ఉద్దేశించి తిలతర్పణాలు చేసినవానికి కూడ మోక్షమార్గం సుగమం అవుతుంది. పిండప్రదానం చేస్తే ముక్తి లభిస్తుందని వేరుగా చెప్పనక్కరలేదు. అమావాస్య, ఉగాది, చంద్రగ్రహణతిథి, సూర్యగ్రహణతిథి మొదలైన దినములలో పార్వణశ్రాద్ధం ఆచరించిన వానికి అక్షయపుణ్యలోకాలు ప్రాప్తిస్తాయి. వాని పితరులు వానిపై శుభాశీర్వచనాలను కురిపించి, మేరలేనన్ని భోగాలను ప్రసాదించి పదివేల సంవత్సరాలవరకు పరితృప్తులై ఉంటారు. కాబట్టి పుత్రులైనవారు ప్రతిపర్వదినమందూ ప్రసన్నతాపూర్వకంగా తమ పితృదేవతలను ఉద్దేశించి విధిగా పార్వణశ్రాద్ధం ఆచరించాలి. మాతాపితరులను ఉద్దేశించి పర్యాయంగా ఈ శ్రాద్ధయజ్ఞాన్ని అనుష్ఠించి మానవుడు సర్వవిధబంధాలనుండి విముక్తుడు అయిపోతాడు.

దినదినమూ ఆచరింపబడు శ్రాద్ధం నిత్యశ్రాద్ధం అనబడుతుంది. శ్రద్ధాపూర్వకంగా నిత్యశ్రాద్ధం ఆచరించినవాడు అక్షయపుణ్యలోకభాజనుడు అవుతాడు. అలాగే కృష్ణపక్షంలో యథావిధిగా కామ్యశ్రాద్ధం ఆచరించిన

మానవుని మనోవాంఛితాలు అన్నీ సిద్ధిస్తాయి. ఆషాఢ శుద్ధపూర్ణిమ గడచిన మీదట వచ్చే 5వ పక్షం (అనగా భాద్రపద బహుళ పాడ్యమి మొదలు అమావాస్య వరకు ఉండే కాలం ) మహాలయపక్షము లేక పితృపక్షము అనబడుతుంది. ఆ కాలంలో పితరులను ఉద్దేశించి శ్రాద్ధవిధులు ఆచరించాలి. ఆ కాలంలో సూర్యుడు కన్యారాశిలో చేరాడా? లేదా? అన్న విచారణ చేయనక్కరలేదు. ఉత్తమ దక్షిణలతో కూడిన యజ్ఞాలకు ఎంత మహత్త్వం ఉంటుందో అంత మహత్త్వమూ సూర్యుడు కన్యారాశిలో ప్రవేశించుటతో మొదలయ్యే 16 రోజులకూ ఉంటుంది. ఆ రోజులలో ఈ పరమపవిత్రమైన కామ్యశ్రాద్ధాన్ని తప్పక ఆచరించాలి. అలా చేస్తే శ్రాద్ధకర్త శుభములను పొందుతాడు. ఏ కారణం చేతనైన ఆకాలంలో శ్రాద్ధవిధిని ఆచరించడం సాధ్యం కాకపోతే సూర్యుడు తులారాశిలో చేరినప్పుడైన కృష్ణపక్షం మొదటిరోజున ఈ కామ్యశ్రాద్ధాన్ని తప్పక ఆచరించాలి.

చంద్రగ్రహణకాలంలో చేసే దానాలు అన్నీ భూదానంతో సమానం అవుతాయి. బ్రాహ్మణులు అందరూ వ్యాసభగవానునితో సమానులు అవుతారు. ఎందులో ఉన్న జలమైన గంగాజలంతో సమానం అవుతుంది. చంద్రగ్రహణకాలంలో చేయబడిన దానము ఇతరసమయాలలో చేయబడిన దానికంటె లక్షరెట్లు అధికంగాను, సూర్యగ్రహణకాలంలో చేసిన దానము పదిలక్షల రెట్లు అధికంగాను ఫలితాన్ని ఇస్తుంది. దానధారకు గంగాజలాన్ని ఉపయోగించడం జరిగితే చంద్రగ్రహణకాలంలోని దానం కోటిరెట్లు. సూర్యగ్రహణకాలంలోని దానం పది కోట్ల రెట్లు అధికఫలాన్ని ఇస్తుంది. విధిపూర్వకంగా లక్ష గోదానాలు చేస్తే వచ్చేఫలితం చంద్రగ్రహణకాలంలో ఒక్కమారు గంగాస్నానం చేస్తే ప్రాప్తిస్తుంది. చంద్రగ్రహణం వేళ, సూర్యగ్రహణం వేళ గంగాస్నానం చేస్తే ఎల్ల పుణ్యతీర్థాలలోనూ స్నానం చేసినంత పుణ్యఫలం వస్తుంది. సూర్యగ్రహణం ఆదివారం నాడూ, చంద్రగ్రహణం సోమవారంనాడూ సంభవిస్తే దానిని చూడామణి యోగం అంటారు. ఆ యోగకాలంలో గంగాస్నానమూ, దానమూ చేస్తే దానికి అనంతగుణితమైన ఫలం చెప్పబడింది. ఆ పుణ్యకాలంలో పుణ్యతీర్థంలో స్నానం చేసి ముందుగా ఉపవాసం చేసి పిండప్రదానమూ, తర్పణాలూ, ధనదానమూ చేస్తే పురుషుడు సత్యలోకంలో శాశ్వతనివాసాన్ని

పొందుతాడు.

ఈ మాటలన్నీ విని నరోత్తముడు మరల - దేవదేవా! ఇంతవరకు మీరు మరణించిన తండ్రిని ఉద్దేశించి చేసే శ్రాద్ధం అనే మహాయజ్ఞాన్ని గూర్చి వివరించారు. ఇప్పుడు సజీవుడైయున్న తండ్రి విషయంలో పుత్రుని కర్తవ్యం ఎలా ఉండాలి? ఎట్టి కర్మాచరణం చేస్తే పుత్రుడు జన్మజన్మాంతరాలలో పరమశుభములను పడయగలుగుతాడు? అనే ఈ విషయాన్ని విశదంగా తెలియజేయగోరుచున్నాను. అని భగవానుని ప్రార్థించాడు.

అప్పుడు భగవానుడు మరల ఇలా చెప్పనారంభించాడు బ్రాహ్మణోత్తమా! చెపుతున్నాను. విను! సర్వదా తండ్రిని దేవునిలాగ భావించి పూజించాలి. తన బిడ్డమీద ఉన్న ప్రేమవంటి ప్రేమను తండ్రిమీద చూపాలి. ఎన్నడూ మానసికంగా కూడ తండ్రి ఆజ్ఞను తిరస్కరించరాదు. వ్యాధిగ్రస్తుడై బాధపడుతూ ఉన్న తండ్రికి సేవచేసిన కుమారుడు అక్షయస్వర్గసుఖం పొందుతాడు. సర్వదా దేవతల పూజలను అందుకుంటాడు. ఆసన్నమరణావస్థలో ఉన్న తండ్రిని సమీపించి పూజనమూ, సేవనమూ చేసిన పుత్రుడు దేవతాతుల్యుడు అవుతాడు. ఇప్పుడు తండ్రియొక్క సద్గతిని కోరి ఉపవాసం చేయడం వలన కలిగే లాభాలను వివరిస్తున్నాను.

విను! వేయి అశ్వమేధయాగాలూ, నూరు రాజసూయయజ్ఞాలూ చేస్తే ఏ ఫలితం కలుగుతుందో అది తండ్రి నిమిత్తం ఉపవాసం చేసిన తనయునకు ప్రాప్తిస్తుంది. ఆ ఉపవాసమే తీర్థస్థలంలో చేస్తే ఆ రెండు యజ్ఞాలకంటెనూ కూడ కోటి రెట్లు అధికఫలం ప్రాప్తిస్తుంది. గంగాజలంలో ఉండగా ప్రాణపరిత్యాగం చేసిన పుణ్యపురుషుడు మరల మాతృస్తన్యపానం చేయనక్కరలేదు. జన్మరాహిత్యం పొందుతాడు.

శ్లో. వారాణస్యాం త్యజేద్యస్తు ప్రాణాంశ్చైవ యదృచ్ఛయా ।
అభీష్టం చ ఫలం భుక్త్వా మద్దేహేప్రవిలీయతే ॥
(పద్మపురాణం. సృష్టిఖండం. 47\252)

ఇచ్ఛాపూర్వకంగా కాశీనివాసం చేస్తూ అచ్చటనే ప్రాణపరిత్యాగం చేసిన పురుషుడు మనోవాంఛితములను అనుభవించి నా స్వరూపంలో లయం పొందుతాడు.

యోగమార్గంలో ఉంటూ నైష్ఠికబ్రహ్మచర్యపాలనం చేసే మునులకు ఏ సద్గతి ప్రాప్తిస్తుందో అది బ్రహ్మపుత్రానదీధారలు ఏడింటిలోనూ ప్రాణపరిత్యాగం చేసినవానికి లభిస్తుంది. ముఖ్యంగా 'సోన్' నది యావలి తటంమీద ఉంటూ అచ్చట ప్రాణపరిత్యాగం చేసినవాడు నాతో సమానుడు అవుతాడు. తన యింటిలోపల ఉండగా ప్రాణపరిత్యాగం చేసినవాని శరీరం మీద ఆయింటిపైకప్పు నిర్మాణంలో ఎన్నికట్లు లేక ముడులు వేయబడ్డాయో అవి యన్నీ వేయబడినట్లు అయి ఏడాదికి ఒక ముడి చొప్పున విడివడడం మొదలు అవుతుంది.

సుతులూ, సోదరులూ, బందుగులూ చూస్తూ ఊరకుండవలసినవారే. కాని ఎవరూ ఏమీ చేయలేరు. ఎవరూ ఆ బంధనాలనుండి విముక్తి కలిగింపలేరు. కొండమీద, అడవిలోనూ, దుర్గమప్రదేశంలోనూ, నీళ్లులేని ప్రదేశమందూ ప్రాణపరిత్యాగం చేసిన పురుషుడు దుర్గతిని పొందుతాడు. అతడు కీటకాదియోనులలో జన్మింపవలసినవాడు అవుతాడు.

తాను మరణించిన రోజున కాక మరునాడు తన శరీరానికి దహనసంస్కారయోగం పొందినవ్యక్తి అరువదివేల యేండ్ల వరకూ కుంభీపాకనరకంలో పడి మ్రగ్గుతూ ఉంటాడు అస్పృశ్యస్పర్శనం చేసి పతితావస్థలో ప్రాణపరిత్యాగం చేసినవాడు చిరకాలం నరకయాతనలను భరించి మ్లేచ్ఛయోనిలో జన్మధారణం చేస్తాడు. పుణ్యబలంవలన, పుణ్యకర్మానుష్ఠానబలంవలన మానవలోకవాసులకు మరణకాలమందు ఎలాంటి బుద్ధికలుగుతుందో అలాంటి (తదనుగుణమైన) గతి ప్రాప్తిస్తుంది.

తండ్రి మరణించిన మీదట దేహదార్ఢ్యం కలవాడైన ఏ కుమారుడు అతని శరీరాన్ని తన భుజంమీదకు ఎత్తుకొని మోస్తాడో వానికి అడుగడుగునా అశ్వమేధయజ్ఞఫలం ప్రాప్తిస్తుంది. తండ్రి యొక్క శవాన్ని

చితిమీదకు చేర్చడం, యథావిధిగానూ, మంత్రోచ్చారణపూర్వకంగానూ మొదట తలకు నిప్పుపెట్టి అనంతరం సర్వశరీరాన్ని దహనం చేయడం పుత్రుని కర్తవ్యం. దహనకాలంలో ఈ మంత్రాన్ని పఠించాలి –

శ్లో. లోభమోహసమాయుక్తం పాపపుణ్యసమావృతమ్ ।
దహేయం సర్వగాత్రాణి దివ్యాన్ లోకాన్ స గచ్ఛతు ॥

(పద్మపురాణం. సృష్టిఖండం.47\266)

అనగా లోభమోహాలతోనూ, పాపపుణ్యాలతోనూ కూడిన తండ్రియొక్క యీ శరీరాన్ని ఇందలి సర్వావయవాలనూ దహనం చేస్తున్నాను. అతడు దివ్యలోకాలకు వెడలుగాక! అని భావం.

ఈ విధంగా దహనసంస్కారం గావించి అస్థిసంచయనం (ఎముకల సేకరణ) కోసం కొన్ని దినాలు ప్రతీక్షించాలి. నిర్ణీతసమయంలో అస్థిసంచయనం చేసి దశాహం (పదియవ రోజు) నాడు స్నానంచేసి తడిబట్టలను విసర్జించాలి.

అనంతరం పదునొకండవనాడు ఏకాదశాహశ్రాద్ధం ఆచరించాలి. ప్రేతముయొక్క శరీరపుష్టికై ఒక బ్రాహ్మణునకు భోజనం పెట్టాలి. ఆ సమయంలో వస్త్రము, పీట, పాదరక్షలను దానం చేయాలి. దశాహానికి నాల్గవనాడు చేసే శ్రాద్ధము, 3 పక్షాలు గడచిన మీదట చేసే త్రైపాక్షిక (సార్ధమాసిక) శ్రాద్ధము, ఆరు మాసాల లోపున జరిపే ఊనషాణ్మాసిక శ్రాద్ధము, సంవత్సరం లోపున జరిపే ఊనాబ్దిక శ్రాద్ధము, ఇదిగాక 12 మాసాలలోనూ జరిపే 12 మాసికశ్రాద్ధాలు కలిపి మొత్తం 16 శ్రాద్ధాలు. ఈ 16 శ్రాద్ధాలూ యథాక్రమంగా జరపబడనినాడు మరణించినవానికి పిశాచత్వం సిద్ధిస్తుంది. అటుపిమ్మట ఎన్ని శ్రాద్ధవిధులు ఆచరించినా వానిని ఆ పిశాచత్వం వదలదు. ఒక ఏడాది గతించిన మీదట పార్వణశ్రాద్ధవిధానాన్ని అనుసరించి యథావిధిగా సపిండీకరణశ్రాద్ధం ఆచరించాలి.

ఆ మాటలు వింటూ నరోత్తముడు మరల – స్వామీ! తాపసులు, వనవాసులు, గృహస్థబ్రాహ్మణులు మొదలైనవారు ధనహీనులై యున్న దశలో పితృకార్యసాధనం ఎలా చేయాలి? అని భగవానుని ప్రశ్నించాడు.

అప్పుడు భగవానుడు ఇలా అన్నాడు – గడ్డి, కట్టెలు మున్నగు దహనకార్యమునకు వలయు సాధనసామగ్రిని సంపాదించియో లేక పైసపైసగా యాచన చేసి కూడబెట్టిన ధనమును వినియోగించియో పితృకార్యమును ఆచరించినవాడు లక్షరెట్లు అధికపుణ్యఫలాన్ని పొందుతాడు. ఈషణ్మాత్రమూ ధనం లేనివాడు తన తండ్రి మరణతిథి ప్రాప్తించినప్పుడు కేవలము గోవులకు గ్రాసమును (గడ్డి) అర్పించిన చాలును. అతనికి పిండప్రదానవిధికంటె ఎక్కువ పుణ్యఫలం ప్రాప్తిస్తుంది.

పూర్వకాలమునాటి విషయము. విరాటదేశంలో అత్యంత దీనుడైన మనుష్యుడు ఒకడు ఉండేవాడు. ఒకనాడు అతనికి తండ్రి యొక్క శ్రాద్ధతిథి వచ్చింది. ధనహీనుడైన కారణాన ఏమియు చేయలేక అతడు ఎంతగానో రోదించాడు. శ్రాద్ధవిధిని ఆచరించుటకు వలయు సాధనసామగ్రులు ఏవీ అతని దగ్గరలేవు. చాలాసేపు విలపించి విలపించి కడకు ఒక పండితుడైన బ్రాహ్మణుని కడకు పోయి – మహాత్మా! ఈ నాడు నా పితృతిథి. శ్రాద్ధవిధిని ఆచరించడానికి నా దగ్గర ఒక్క పైస కూడ లేదు. ఈ పరిస్థితిలో నేను ఏమి చేయాలి? ఏమి చేస్తే నాకు హితం చేకూరుతుంది? నేను ధర్మభ్రష్టుడను కాకుండుటకు మార్గం ఏదియో నాకు తెలియజెప్పండి అని ఆతనిని ప్రార్థించాడు.

అప్పుడు ఆ బ్రాహ్మణుడు ఇలా అన్నాడు నాయనా! ఇప్పుడు కుతపకాలము (పగటిలో ఎనిమిదవ భాగపు కాలము) సాగుతోంది. నీవు వడివడిగా వనములోనికి పోయి ఘాసమును (గడ్డి) సేకరించి తెచ్చి గోవునకు తినిపించుమా.

అనగా విని వెంటనే అతడు వనంలోనికి పోయి గడ్డిమోపును తెచ్చి సానందంగా తన తండ్రి యొక్క తృప్తిని గోరి గోవునకు తినిపించాడు. ఆ

పుణ్యప్రభావం చేత అనంతరకాలమందు అతడు దేవలోకమును పొందాడు.

కాబట్టి పితృయజ్ఞానికి సాటియైన ధర్మంలేదు. ప్రతి వ్యక్తి ప్రయత్నపూర్వకంగాను, శక్త్యానుసారంగాను మాత్సర్యాన్ని వీడి తప్పక శ్రాద్ధవిధిని ఆచరించాలి.

ఈ అధ్యాయం ధర్మసంతానాధ్యాయం. (ధర్మాన్ని విస్తరింపజేసేది) ఈ అధ్యాయాన్ని పఠించినవానికి ప్రతిలోకంలోనూ గంగాస్నానఫలం ప్రాప్తిస్తుంది. జన్మజన్మాల మానవుడు కూడ బెట్టిన. మహాపాతకరాశులు అన్నీ ఒక్కమారు ఈ అధ్యాయాన్ని పఠనమూ, శ్రవణమూ చేసినంత మాత్రాన పటాపంచలు అయిపోతాయి.

----oOo----

## బ్రాహ్మణపతివ్రత ఉపాఖ్యానము
## కులటాస్త్రీల విషయంలో ఉమానారద సంవాదము
## పతివ్రత మహాత్మ్యము, కన్యాదానఫలము

నాథా! జగన్నాథా! ముందు దర్శించిన శుభాదేవి యను పతివ్రత గడచిపోయిన నా వృత్తాంతం ఎలా తెలుసుకోగలిగింది? ఆమె యొక్క ప్రభావం ఎట్టిది? కృపజూపి నాకు ఈ విషయమును ఎరిగింపుడు. అని విప్రవరుడైన నరోత్తముడు భగవానుని కోరెను.

అప్పుడు భగవానుడు ఇలా చెప్పాడు – వత్సా! నీకు ఈ విషయం ముందే తెలిపియున్నాను. అయినా ఇంకా విపులంగా వినాలి అని అనుకుంటే చెపుతున్నాను. విను! నీప్రశ్నకు సమగ్రంగా సమాధానం చెపుతున్నాను. ఏ స్త్రీ తన భర్తను ప్రాణసమానంగా చూచుకుంటూ, సర్వదా అతని హితం కోసమే పాటుపడుతూ ఉంటుందో అట్టి పతివ్రతామతల్లి దేవతలకూ, బ్రహ్మవాదులైన మునులకు కూడ పూజ్యురాలు అవుతుంది. బ్రతికేయున్నంత కాలమూ ఒకే పురుషుని సేవను అంగీకరించి, పొరపాటున కూడ పరపురుషుని వంకకు కన్నెత్తి చూడకుండ ఉండే స్త్రీ లోకంలో పరమపూజ్యురాలు అవుతుంది.

నాయనా! ప్రాచీనకాలంనాటి విషయం చెపుతున్నాను. విను! పూర్వం మధ్యదేశంలో అందమైన నగరం ఒకటి ఉండేది. అందు ఒక పతివ్రతయగు బ్రాహ్మణస్త్రీ ఉండేది. ఆమె పేరు శైబ్య.* ఆమె భర్త పురాకృతకర్మఫలం కారణంగా కుష్ఠువ్యాధిగ్రస్తుడు అయ్యాడు. వాని శరీరంలో ఎన్నో వ్రణాలు ఏర్పడి వాటినుండి చీమునెత్తురులు కారుతూ ఉండేవి. శైబ్య ఆ భర్తకు సేవలు చేయడంలో నిమగ్నురాలై యుండేది. అతడు ఏది కోరిన దానిని ఆమె యథాశక్తి ప్రయత్నించి సఫలం చేస్తూ ఉండేది. ప్రతిదినమూ అతనిని దేవుని పూజించినట్లు పూజించేది. దోషబుద్ధి విడిచి ఏవగింపులేక అతనిని విశేషంగా ప్రేమించేది.

---

* ఈమెయే సుమతి యనియు పిలువబడినది.

ఒకనాడు ఆమె భర్త వీధిలో పోవుచున్న అందాలరాశి యగు వేశ్యను చూచాడు. తోడనే అతని మనస్సు మోహగ్రస్తం అయింది. అతని మనస్సు మదనదేవుని వశం అయిపోయింది. ఆమెనే తలపోస్తూ అతడు చాలాసేపు నిట్టూర్పులు విడుస్తూ ఉండి కడకు బెంగటిల్లినవానివలె ఏదీ రుచింపక ఉత్సాహహీనతను, ఖేదమును పొందుతూ క్రుంగిపోసాగాడు. అతని నిట్టూర్పులను ఆలకించి పతివ్రత వచ్చి స్వామీ! మీరు దిగులుగా ఉన్నారేల? నిట్టూర్పులు ఏల విడుచుచున్నారు? మీకు ఏమి కావలెనో సంకోచింపక నాకు తెలియజేయండి. అది నేను చేయదగినదైనా తగనిదైనా మీకోసం సాధించగలను. మీరే నాకు పరమగురువులు. పరమదైవతములు. పరమప్రియతములు అని సవినయంగా కోరింది.

ప్రేయసీ! నేను అభిలషించే కార్యాన్ని నీవు సాధించలేవు. నేనూ సాధించుకోలేను. కాబట్టి ఆ విషయాన్ని గూర్చి మాటలాడడం నిరర్థకం అన్నాడు ఆమె భర్త.

నాథా! మీ కోరికను ఎరిగి దానిని సాధించగలనన్న నమ్మకం నాకు ఉంది. సందేహింపక మీ కోరిక యేమో నాకు తెలియజేయండి. ఏ విధంగానైన, ఏ ఉపాయం చేతనైన మీకోసం ఆ కార్యాన్ని సాధించుటకు ప్రయత్నిస్తాను. మీరు చెప్పిన పని దుష్కరం అయినదైన దానిని నేను ప్రయత్నపూర్వకంగా సాధించగలిగితే ఇహమందూ, పరమందూ కూడ నాకు పరమశుభం చేకూరుతుంది. అని పతివ్రత పలికింది.

సాధ్వీ! ఇప్పుడిప్పుడే మన యింటి ముందు మార్గాన ఒక పరమసుందరీమణియైన వేశ్య వైదలుచుండగా నేను చూచాను. అప్పటినుండి నా మనస్సు కామాగ్నిలో దగ్ధం అవుతోంది. నీ దయ వలన నేను ఆ నవయౌవనవతి పొందును పొందగలిగితే నా జన్మ ధన్యం అవుతుంది. నీవు నాకు ఆమె పొందును కలుగజేయుట మూలంగా నా యభీష్టమును సాధించిపెట్టుమా. అని భర్త పలికాడు.

ఆ మాట విని ఆమె – స్వామీ! ప్రస్తుతం యొకింత ఓరిమి

వహించండి. నేను శక్తివంచనలేకుండ ప్రయత్నం చేసి మీ కోరికను తీరుస్తాను.

ఇలా పలికి ఆమె తనలో యెుకింత ఏమో ఆలోచించుకొంది. నాటి రాత్రి చివరిభాగాన అనగా తెల్లవారుజామున మేల్కొని గోమయమూ, చీపురుగ్రహించి పరమానందంతో ఆ వేశ్య యింటికి వెళ్లింది. అప్పుడు ఆయింటి చుట్టునూ, ముందువాకిటి యందూ శుభ్రంగా చిమ్మి నీళ్లు చల్లి మ్రుగ్గులు పెట్టి జనులకంట పడకుండ వడివడిగా తన యింటికి మరలి వచ్చింది. ఆ విధంగా ఆమె వరుసగా మూడు నాళ్లు ఆ వేశ్య యింటి దగ్గర చిమ్మి, నీళ్లు చల్లి, గోమయంతో అలికి మ్రుగ్గులు పెట్టి వచ్చింది.

అక్కడ వేశ్య తన దాసదాసీజనవర్గాన్ని పిలిచి యీ నాడు మన యింటి చుట్టూ ఇంత చక్కగానూ, పరిశుభ్రంగానూ తుడిచి కల్లాపి చల్లి అలికి మ్రుగ్గులు పెట్టినవారు ఎవరు? అని ప్రశ్నించింది. తాము ఎవ్వరూ ఆ పని చేయలేదని వారు బదులు చెప్పారు. అది విని ఆమెకు పరమాశ్చర్యం కలిగింది. ఆమె కొంత తడవు ఏమో ఆలోచించుకొంది. నాటి రాత్రి తెల్లవారు జామున లేచి చూడగా ఆమెకు బ్రాహ్మణపతివ్రత కానవచ్చింది. అప్పుడామె ఆ పతివ్రతామతల్లిని సమీపించి అయ్యయ్యో! ఇదేమి పని తల్లీ! వలదు! వలదు! ఇట్టి పని మీరు చేయవలదు. నన్ను క్షమించండి. ఈ పని మానివేయండి. అంటూ వేశ్య ఆమె చరణాలమీద వ్రాలి యింకనూ ఇలా పలికింది – పతివ్రతామతల్లీ! మీరు నా ఆయువును, శరీరాన్ని, సంపదను, కీర్తిప్రతిష్ఠలను నాశనం చేయడానికి ఇలాంటి పని చేస్తున్నారు. ఇది మీకు తగదు. మీకు నావలన సువర్ణమా ? మణులా? రత్నాలా? వస్త్రాలా?ఇతరములైన వస్తువులా? ఏమి కావాలి? ఏమి కావలసినా ఇస్తాను సంకోచింపక అడగండి. తల్లీ!

ఆ మాటలు విని పతివ్రత – తల్లీ! నాకు ధనం అక్కరలేదు. సువర్ణమూ అక్కర లేదు. నీతోనే పని ఉన్నదమ్మా అది ఎట్టిది అయినా చేస్తాను అంటే చెపుతాను. ఆ కార్యం నెరవేరినప్పుడే నాకు సంతోషం కలుగుతుంది. అప్పుడే నా అభిలాష ఫలించిందని భావించుకొంటాను. అని

బదులు పలికింది.

తల్లీ! పతివ్రతామతల్లీ! ఆ కోరిక యేమో వెంటనే తెలుపండి. మీరు ఏమి కోరినా తప్పక సఫలం చేస్తాను. వెంటనే మీ ఆవశ్యకత యేమో తెలిపి నన్ను రక్షించండి. అని వేశ్య పలికింది.

అంతట పతివ్రత సిగ్గుపడుతూ, జంకుతూ మెల్లగా తన పతి కోరికను ఆమెకు తెలియజేసింది. ఆ కోరికను విని వేశ్య క్షణకాలం తన కర్తవ్యాన్ని గూర్చి పతివ్రతయొక్క భర్త భరిస్తూ ఉన్న వేదనను గూర్చి ఆలోచించింది. దుర్గంధభరితుడైన కుష్ఠురోగితోడ సంపర్కాన్ని తలచి ఆమెకు మానసికంగా ఎంతో వ్యధ కలిగింది. కడకు ఆమె ఎట్లో వ్యతిరేకిస్తూ ఉన్న మనస్సును చిక్కబట్టుకొని – దేవీ! నీ భర్త నా యింటికి రాగలిగితే ఒక్కనాడు మాత్రం అతని కోరికను తీర్చగలను అని బదులు చెప్పింది..

సుందరీ! నేను నేటి రాత్రియందే నా భర్తను తీసుకొని నీ యింటికి వస్తాను. ఆయన కోరిక తీరినవెంటనే మరల నాయింటికి తోడ్కొని పోయెద్దను అని పతివ్రత పలికింది.

అట్లే కానీయండి మీరు ఇక మీ యింటికి వెడలిపొండి. ఈ నాటి అర్థరాత్రిసమయాన మీ భర్త నా యింటికి వచ్చునట్టి ఏర్పాట్లు చేయండి. అని మరల వేశ్య పలికింది.

ఆ మాట విని సంతోషంతో పతివ్రత తనయింటికి మరలివచ్చి తన భర్తను సమీపించి –స్వామీ! మీ కార్యం నెరవేరింది. మీరు ఈ రాత్రియందే ఆమె యింటికి వెళ్లాలి అని అతనితో చెప్పింది. అప్పుడు అతడు – దేవీ! నేను నడవలేనివాడను. ఆమె యింటికి ఎలా వెళ్లగలను? నా అభిలాష ఎలా ఫలిస్తుంది? అని తన సందేహాన్ని వ్యక్తం చేసాడు.

ప్రాణనాథా! ఆ విషయంలో మీరు చింతించకండి! మిమ్ము నేను నా వీపుమీదకు ఎక్కించుకొని పోయి ఆమె యింటికి చేరుస్తాను. మీ కోరిక

తీరగానే మరల మిమ్ము ఆ విధంగానే మన యింటికి తీసుకొనివస్తాను. అని పతివ్రత తన భర్తకు సంతోషం కలిగించింది.

కల్యాణీ! నీప్రయత్నంవలన, సహకారంవలన మాత్రమే నా యీ కార్యం సిద్ధించేది. ఇప్పుడు నీవు చేసినట్టి పనిని లోకంలో ఏ స్త్రీ కూడ చేయలేదు అని ఆమె భర్త పలికెను.

ఇక్కడ వీరి పరిస్థితి యిట్లుండగా నగరంలోని ఒక ధనికుని యింటిలో దొంగలు దూరి అతని సర్వస్వమూ దోచుకొనిపోయారు. ఆవార్త ఆ నగరాన్ని ఏలుతూ ఉన్న మహారాజు దృష్టికి వచ్చింది. వెంటనే అతడు తన గూఢచారులను అందరనూ రావించి వారిమీద క్రోధం ప్రకటించి పొండి. మీకు మీప్రాణాలమీద తీపి ఉంటే సాధ్యమైనంత శీఘ్రంగా చోరులను పట్టితెచ్చి నా ముందు నిలుపండి. అని వారికి ఆదేశం ఇచ్చారు. ఆ ఆదేశాన్ని విని ఆ గుప్తచరులు మనస్సులో కలతపడి తక్షణం చోరులను వెదకుటకు వెడలిపోయారు.

ఆ నగరానికి చేరువగా ఒక దట్టమైన అడవి ఉంది. అందు ఒక చెట్టుక్రింద మాండవ్యమహర్షి సమాధిదశను పొంది కూర్చుండియున్నాడు. అతడు యోగులలో అగ్రగణ్యుడు. అగ్నివలె దేదీప్యమానుడై, బ్రహ్మవలె తేజశ్శాలియై ప్రకాశిస్తూ ఉన్నవాడు. గుప్తచరులు ఆ మహాభాగుని చూచారు. వీడే దొంగ. ఈ మాయవేషం వేసుకొని ఈ యడవిలో నివసిస్తూ ఉన్న దొంగ వీడు అంటూ తమలో తాము కూడపలుక్కున్నారు.

వెంటనే ఆ పాపాత్ములు ఆ మాండవ్యమహర్షిని బంధించివేశారు. వారు ఏమిచేసినా ఆ మహర్షి వారి వంకకు కన్నెత్తి చూడలేదు. వారిని ప్రతిఘటించలేదు. వారు అతనిని బందనాలతో మహారాజు దగ్గరకు కొనిపోయి ఇదుగో! దొంగ. పట్టితెచ్చాము అని చెప్పారు. వీనిని మీరు నగరప్రవేశద్వారం చెంతకు తీసుకొనిపోయి వీనికి చోరులకు నిర్ణీతమైయున్న శిక్ష విధించండి! పొండి! అని మహారాజు వారిని ఆదేశించాడు. వారు అతనిని వెంటనే ఆ ప్రదేశానికి తీసుకొనిపోయి పెను

శూలంమీద గ్రుచ్చివేశారు, కొరతవేశారు. అప్పటికి నాలుగుదిక్కులా చిమ్మచీకటులు ఆవరించాయి. క్రమంగా నిశీథసమయం అయింది. ఆకాశంమీద ఆ సమయంలో కారుమబ్బులు కూడ క్రమ్మియున్నాయి. కన్నూ, మిన్నూ కానరానట్టి ఆ కటిక చీకటివేళ బ్రాహ్మణ పతివ్రత తనవెన్నుమీద భర్తను ఎక్కించుకొని ఆ శూలానికి చేరువగా సాగిపోసాగింది. అప్పుడు ఆ కుష్ఠురోగి శరీరం మాండవ్యమహర్షి శరీరానికి తగిలింది. అంతట ఆ మహర్షికి సమాధిభంగం అయింది. అప్పుడు అతడు క్రోధంతో మండిపడుతూ – ఈ సమయంలో నన్నుతాకి నాకు భయంకరవేదన గలిగించినవాడు సూర్యోదయం అవుతూ అవుతూ ఉండగా భస్మమైపోవుగాక. అని దారుణంగా శపించాడు.

మాండవ్యుని నోట శాపవచనం వెలువడగానే పతివ్రత భర్త నేలమీద కూలబడ్డాడు. నేటినుండి సూర్యోదయమే కాకుండు గాక! అని మరియొక శాపంవిధించి తన పతిని ఎత్తుకొని పతివ్రత మెల్లగా తన గృహానికి మరలిపోయింది. ఇల్లు చేరి ఆమె తన భర్తను ఒక సుందరమైన శయ్యమీద పరుండపెట్టి అతనిని పట్టుకొని ప్రక్కనే కూర్చుండిపోయింది. అక్కడ ఆ మాండవ్యమహర్షి కుష్ఠురోగిని శపించినవెంటనే తన తపఃప్రభావం చేత శూలంనుండి విడివడి తన యిచ్ఛవచ్చిన దిక్కునకు వెడలిపోయెను. ఈ విధంగా మూడు దినాలు గడిచాయి. ఆ మూడు దినాలూ సూర్యుడు ఉదయించలేదు. చరాచరప్రాణులతోడ మూడులోకాలూ తల్లడిల్లిపోసాగెను.

ఈ పరిస్థితిని చూచి దేవతలు అందరు ఇంద్రుని తమముందు నిల్పుకొని బ్రహ్మకడకు పోయి – దేవా! సూర్యోదయం కాకుండుటకు కారణం ఏమో ఎరుగరాకున్నది. మీరిప్పుడు యుక్తాయుక్తాలను ఆలోచించి కర్తవ్యనిర్ణయం చేయగోరుతున్నాము అని అతనిని ప్రార్థించారు. వారి మాటలు విని బ్రహ్మ బ్రాహ్మణపతివ్రతయొక్క, మాండవ్యమహర్షి యొక్క ఉదంతం వారికి తెలియజెప్పాడు. అనంతరం దేవతలు అందరు విమానారూఢులై బ్రహ్మదేవుని ముందు నిడుకొని శీఘ్రంగా పోయి కుష్ఠురోగపీడితుడైన ఆ బ్రాహ్మణుని యింటికి చేరారు. వారి విమానాల కాంతితో అచ్చటకు చేరిన మహర్షుల తేజస్సుతోను పతివ్రత గృహం

కోటిసూర్యప్రభాభాసమానం అయింది. హంసలవలె ధవళకాంతులను ప్రకటిస్తూ ఉన్న విమానాలను. అందున్న దేవతలను పతివ్రత చూచింది. అప్పుడామె తన పతిచెంత పరుండిఉంది. బ్రహ్మ ఆమెను సంబోధించి, తల్లీ! సూర్యుడు ఉదయించకుండ నీవు విధించిన ప్రతిబంధకం కారణంగా దేవబ్రాహ్మణగోగణాదులకు పెనుముప్పు దాపురించింది. ఇలాంటిపని చేయడానికి నీకు మనసు ఎలాఒప్పింది? సూర్యోదయం కాకుండ నీవు విధించిన ప్రతిబంధకాన్ని ఉపసంహరించుమమ్మా అని పలికాడు.

అప్పుడు పతివ్రత యిలా బదులు చెప్పింది – దేవా! నాకు కేవలమూ ఒక్క పతియే గురువు అతడే నాకు సర్వస్వం. అతడు నాకు లోకాలన్నిటికన్న అధికుడు. సూర్యుడు ఉదయించగానే మహర్షి శాపం కారణంగా ఇతడు మరణిస్తాడు. అందుచేతనే నేను సూర్యుడు ఉదయించకుండ ప్రతిబంధకశాపం పెట్టాను. క్రోధము, మోహము, లోభము, మాత్సర్యము వంటి తామసవృత్తులకు లోబడి నేను ఈ శాపం విధించలేదు.

ఆ మాటలు విని మరల బ్రహ్మ – అమ్మా! ఒక్కని మరణంవలన మూడులోకాల వారికీ శరణం లభించి కల్యాణం చేకూరుతోంది అంటే అందువలన నీకు పుణ్యమే కలుగుతుంది కదా! అన్నాడు.

నా భర్తను పరిత్యజించగా సత్యలోకం ప్రాప్తించినా నాకది రుచించదు అని పతివ్రత పలికింది.

అమ్మా! సూర్యుడు ఉదయిస్తే మూడులోకాలూ స్వస్థతను పొందుతాయి. అప్పుడు నీ భర్త భస్మం అయిపోయినా నేను నీకు పరమకల్యాణం చేకూరుస్తాను. మా అందరి ఆశీస్సులతోను అతడు నవమన్మథరూపాన్ని పొందుతాడు. ఏమందువు? అని బ్రహ్మమరల పలికాడు.

అప్పుడామె మనములో క్షణకాలం ఆలోచించుకొని అట్లయిన సరియే

అని తన అంగీకారం తెలిపింది. వెంటనే శాపాన్ని ఉపసంహరించింది. సూర్యుడు ఉదయించాడు. మహర్షి శాపంచేత పీడితుడై ఆమె భర్త తత్కాలమందే భస్మం అయిపోయాడు. పిమ్మట ఆ భస్మరాశినుండియే నవమన్మథసుందరాకారంతో అతడు ప్రత్యక్షం అయ్యాడు. ఆ దృశ్యం చూచి పురవాసులందరూ పరమాశ్చర్యం పొందారు. దేవతలు ప్రసన్నత చెందారు. జనుల హృదయాలు స్వస్థతను పొందాయి. అప్పుడు స్వర్గంనుండి సూర్యప్రభాభాసమానమయిన విమానం ఒకటి వచ్చింది. పతివ్రతామతల్లి తన భర్తతోడ ఆ విమానాన్ని అధిరోహించి దేవతలతోడ స్వర్గానికి వెడలిపోయింది.

నరోత్తమా! నీవు దర్శించిన శుభాదేవి కూడ ఈమెతో సమానురాలైన పతివ్రతామతల్లియే, ఆ కారణం చేత ఆమె నాకు సమానురాలు అయింది. తన పాతివ్రత్యప్రభావం చేతనే ఆమె భూతభవిష్యద్వర్తమానాలూ, మూడు కాలాల విషయాలనూ తెలుసుకోగలుగుతోంది. ఇది పతివ్రతామతల్లి చరిత్ర. పరమపుణ్యమయమైన ఈ చరిత్రను ఎవడు ప్రవచించి లోకులకు వినిపిస్తాడో వాని అనేక జన్మల పాపాలు అన్నీ ఒక్క మారుగా చెల్లిపోతాయి.

అనగా విని నరోత్తముడు మరల నాథా! జగన్నాథా! మాండవ్యుడు మహర్షి కదా. అతనికి శూలాఘాతపు శిక్ష ఎందులకు ప్రాప్తించింది? పతివ్రతామతల్లికి కుష్ఠురోగి భర్తగా ఎందులకు ప్రాప్తించాడు? నాకు తెలియ జెప్పండి. అని భగవానుని ప్రార్థించాడు.

అప్పుడు విష్ణుభగవానుడు ఇలా అన్నాడు – నరోత్తమా! విను! చెపుతున్నాను. మాండవ్యమహర్షి చిన్నపిల్లవాడుగా ఉన్నప్పుడు గొల్లభామ పురుగును పట్టుకొని దానిలో పుల్లలు గ్రుచ్చి విడిచిపెట్టేవాడు. అప్పటికి ఇంకను అతనికి ధర్మజ్ఞానం అబ్బియుండలేదు. అప్పటి అతని దశ అజ్ఞానదశ. అయినా ఆ దోషం కారణంగా అతడు ఒక పగలు, రాత్రి శూలాఘాతదండనాన్ని భరించవలసివచ్చింది. అయినా అతడు ఆ సమయంలో సమాధిదశలో ఉన్న కారణంగా అతనికి వేదనానుభవం

అంతగా కలుగలేదు. అలాగే పతివ్రతయొక్క భర్త కూడ పూర్వజన్మంలో ఒక కుష్ఠురోగపీడితుడైన బ్రాహ్మణుని చంపివేశాడు. ఆకారణంగా అతనికి ఈ జన్మలో కుష్ఠువ్యాధిపీడ ప్రాప్తించింది. అయినా అతడు పూర్వజన్మలో బ్రాహ్మణులకు నాలుగు గోరీదానాలూ, మూడు కన్యాదానాలూ చేసియున్నాడు. ఆ కారణంగా అతనికి ఇప్పుడు పతివ్రతయైన భార్యప్రాప్తించింది. ఆ పతివ్రత కారణంగానే అతడు నాతో సమానత్వాన్ని పొందగలిగాడు.

అప్పుడు నరోత్తముడు మరల భగవానునితో - స్వామీ! పతివ్రతాస్త్రీయొక్క ప్రభావం అంత మహత్తరం అయినది అయినప్పుడు వ్యభిచారలక్షణం లేని భార్యకల ప్రతి పురుషునకూ స్వర్గం లభించడం తథ్యం అన్నమాట, పతివ్రతవలన సమస్తజగత్కల్యాణం సంభవమే అన్నమాట అని అన్నాడు.

అంతట భగవానుడు మరల ఇలా అన్నాడు - అవును. ఆ మాట నిజం. కాని లోకంలో కొందరు స్త్రీలు కులటలై ఉంటారు. వారు తమయందు సర్వసమర్పణం చేసిన పురుషునకు అసంతుష్టి కలిగే విధంగాను, వ్యతిరేకంగానూ వ్యవహరిస్తూ ఉంటారు. వారిలో పెడత్రోవలు పట్టకుండా ఎంతమాత్రమూ కాపాడ శక్యంకాని ఆడదానిని మానసికంగా కూడ స్వీకరించరాదు. కామాంధురాలైన స్త్రీ నిర్ధనుడైన వానిని, కురూపుని, సుగుణసంపద లేనివానిని, నిమ్న జాతిలో పుట్టిన వానిని సైతమూ భర్తగా స్వీకరించేస్తుంది. మరణావస్థను కొనితెచ్చుకోవడానికి కూడ ఆమె వెనుకంజవేయదు. ఇచ్ఛానుసారంగా ఆమె గుణవంతుడూ, కులీనుడూ, మహాధనవంతుడూ, సుందరాకారుడూ, సంభోగచతురుడూ అయిన భర్తను కూడ పరిత్యజించి నీచుడైన పురుషుణ్ణి సేవిస్తుంది.

బ్రాహ్మణోత్తమా! ఈ విషయంలో ఉమానారదసంవాదమే ప్రమాణం. కారణం ఏమన నారదుడు స్త్రీల చేష్టలను బాగుగా ఎరిగినవాడు. అతడు సహజంగా లోకంలోని ప్రతి విషయమూ తెలుసుకోవాలని అభిలషించేవాడు. ఒక పర్యాయం అతడు తనమనసులో ఏమో

ఆలోచించుకొని పార్వతీ పరమేశ్వరుల ఆవాసస్థానం అయిన కైలాసాచలమునకు వెడలెను. అక్కడ అతడు పార్వతీదేవికి నమస్కారం చేసి అమ్మా! నేను మీ వలన కామినుల కుచేష్టలను తెలుసుకొనగోరుతూ ఉన్నాను. నాకు ఈ విషయంలో ఏమీ తెలియదు. వినయభావంతో ప్రశ్నిస్తున్నాను. దయచేసి నాకు తెలియజెప్పండి, అని ఆమెను ప్రార్థించాడు.

అప్పుడు పార్వతీదేవి యిలా తెలియజెప్పింది – నాయనా! చెపుతున్నాను విను యౌవనవతులైన స్త్రీల చిత్తం సర్వదా పురుషులమీదనే లగ్నమై ఉంటుంది అనడంలో సందేహం లేదు.

శ్లో. ఘృతకుంభసమా నారీ తప్తాంగారసమః పుమాన్ ।
తస్మాద్ ఘృతం చ వహ్నిం చ హ్యేకస్థానే న ధారయేత్॥

(పద్మపురాణం. సృష్టిఖండం 49\21)

స్త్రీ నేతితో నింపబడిన కుంభంవంటిది. పురుషుడు కనలుతూ ఉన్న అనలకణాల వంటివాడు. కాపున నేతిని, అగ్నిని సన్నిహితంగా ఒక చోట నిలపరాదు.

మదించిన ఏనుగును మావటివాడు అంకుశం, ముద్గరం వంటి సాధనాలతో ఎలా అదుపులో ఉంచుకొంటాడో అలాగే స్త్రీల రక్షకుడు వారిని దండనబలంతోనే అదుపులో ఉంచుకోగలుగుతాడు.

శ్లో. పితా రక్షతి కౌమారే భర్తా రక్షతి యౌవనే ।
పుత్రాశ్చ స్థావిరే భావే న స్త్రీ స్వాతంత్ర్యమర్హతి ॥
(పద్మపురాణం. సృష్టిఖండం 49\23)

చిన్నతనంలో తండ్రి, యౌవనదశలో భర్త, వార్థక్యంలో పుత్రుడు స్త్రీని రక్షిస్తారు. (రక్షించాలి. ఆమె వారి రక్షణలో ఉండాలి) ఏ పరిస్థితియందూ

ఆమెకు స్వతంత్రమునీయరాదు.

సౌందర్యవతియైన స్త్రీకి స్వేచ్ఛను ఇస్తే ఆమె పరపురుషుని ప్రార్థనకు లోబడిపోయి వ్యభిచారంలో ప్రవర్తించేస్తుంది. సిద్ధాన్నంమీద, సిద్ధం అయిన వంటకాలమీద దృష్టి నిలుపకపోతే వానిని కాకులు, కుక్కలు వశం చేసుకుంటాయి. అలాగే యౌవనవతి అయిన స్త్రీ స్వతంత్రము వహిస్తే వ్యభిచారిణి అయిపోతుంది. అనంతరం ఆ కులటతోటి సంబంధం వలన ఆమె కులం అంతా దూషితం అయిపోతుంది. పరుని బీజం వలన పుట్టిన మానవుడు వర్ణసంకరుడు అనబడతాడు. ఈ మాటలకు పద్మపురాణంలో చెప్పిన యీ శ్లోకాలే ప్రమాణం.

శ్లో. అరక్షణాద్యథా పాకః శ్వకాకవశగో వసేత్ ॥
తథైవ యువతీ నారీ స్వచ్ఛందాద్దుష్టతాం వ్రజేత్ ॥

శ్లో. పునరేవ కులం దుష్టం తస్యాః సంసర్గతో భవేత్
పరబీజే నరో జాతః స చ స్యాద్వర్ణసంకరః
(పద్మపురాణం. సృష్టిఖండం 49\25-26 )

సదాచారపరాయణురాలైన స్త్రీ పితృవంశమూ, భర్తృవంశమూ రెండిటినీ వర్ధిల్లజేస్తుంది. సాధ్వీమణి తన వంశాన్ని సముద్ధరిస్తుంది. దురాచారపరురాలు తన వంశాన్ని నరకంలో పడద్రోస్తుంది. లోకంలో స్వర్గం అయినా, నరకం అయినా కళంకం అయినా, కీర్తియైన, అపకీర్తియైన, పుత్రులైన, పుత్రికలైనా, మిత్రులైనా, ఇతరులూ, ఇతరమూ ఏదయినా సర్వమూ ఆడదానిని బట్టియే ప్రాప్తిస్తూ ఉంటాయని పెద్దలు చెపుతారు. కాబట్టి విద్యావంతుడైన పురుషుడు సంతానాపేక్షతో వివాహం చేసుకోవాలి. పాపాత్ముడైన యే పురుషుడు ఉత్తమురాలైన స్త్రీని కలుషితురాలిని గావించి వదలివేస్తాడో వాడు ఆ స్త్రీని హత్యచేసినంత మహాపాపాన్నిపొంది నరకంలో కూలుతాడు. పరస్త్రీని బలాత్కరించినవాడు, ధనం ఇచ్చి తన వలలో చిక్కుకొనజేసినవాడూ స్త్రీ హంతకులుగా పరిగణింపబడి మరణానంతరం ఘోరనరకం పాలవుతాడు. పరస్త్రీని అపహరించినవాడు

చండాలుడై జన్మిస్తాడు. భర్తను వంచించిన స్త్రీ చిరకాలం నరకాగ్నిలో మ్రగ్గి కాకిజన్మం ఎత్తుతుంది. ఉచ్ఛిష్టము, అశుద్ధపదార్థము తింటూ జీవనయాపనం చేస్తుంది.

అనంతరం మానవస్త్రీగా జన్మించి వైధవ్యం పొందుతుంది. తల్లితోను, గురుపత్నితోను, బ్రాహ్మణస్త్రీతోనూ, రాజుభార్యతోనూ, ఇతరులైన ఏ ప్రభుని భార్యతో అయిననూ సంగమం చేసినవాడు అక్షయనరకంలో కూలుతాడు. వీరే కాక సోదరి, మేనయల్లుని భార్య, కూతురు, కోడలు, పినతల్లి, మేనయత్త, తండ్రియొక్క సోదరి మొదలైన స్త్రీలతో సంగమించినవానికి కూడ నరకంనుండి విముక్తి లేదు. అంతే కాదు. అట్టివానికి బ్రహ్మహత్యామహాపాతకం చుట్టుకుంటుంది. అతడు మూగవాడై, గ్రుడ్డివాడై, చెవిటివాడై నిరంతరంగా అధోగతిపాలు అవుతునేఉంటాడు. ఆ నిరంతరపతనావస్థనుండి వానికి ఇక రక్షణ లభించదు.

కర్మప్రాబల్యం కారణంగా ఎవడైనా అలాంటి మహాపాపపుపని చేస్తే వాడు ఉద్ధరింపబడేది యెట్లు అని నరోత్తముడు భగవానుని మరల ప్రశ్నించాడు.

అప్పుడు భగవానుడు ఇలా చెప్పాడు – పైన ఉదాహరించిన స్త్రీలతోడ సంగమించిన పురుషుడు తనకు సంక్రమించిన మహాపాపం పోవాలి అంటే ఇనుముతో స్త్రీప్రతిమను తయారుచేయించి. దానిని అగ్నిలో బాగుగా తప్తం చేసి గాఢంగా దానిని ఆలింగనం చేసుకోవాలి. తన్మూలకంగా ప్రాణపరిత్యాగం చేయాలి. అలా చేస్తే అతడు పరిశుద్ధుడు అవుతాడు.

శ్లో. యో వై గృహాశ్రమం త్యక్త్వా మచ్చిత్తో జాయతే నరః ।
నిత్యం స్మరతి గోవిందం సర్వపాపక్షయో భవేత్ ॥

బ్రహ్మహత్యాయుతం తేన కృతం గుర్వంగనాగమః ।
శతం శతసహస్రం చ పైష్టిమద్యస్య భక్షణమ్ ॥

స్వర్ణాదేర్హరణం చైవ తేషాం సంసర్గకశ్చిరమ్ ।
ఏతాన్యన్యాని పాపాని మహాంతి పాతకాని చ ॥

అగ్నిం ప్రాప్య యథా తూలం తృణమాశు ప్రణశ్యతి ।
తస్మాన్మన్నామ గోవిందం స్మృత్వా పూతో భవేన్నరః ॥

యో వా గృహాశ్రమే తిష్ఠేన్నిత్యం గోవిందఘోషణమ్ ।
కృత్వా చ పూజయిత్వా చ స పాపాత్సంతరో భవేత్ ॥

భాగీరథీతటే రమ్యే ఖగస్య గ్రహణే శివే ।
గవాం కోటిప్రదానేన యత్ఫలం లభతే నరః ॥

తత్ఫలం సమవాప్నోతి సహస్రం చాధికం చయత్ ।
గోవిందకీర్తనే తాత! మత్పురే చాక్షయం వసేత్ ॥
(పద్మపురాణం. సృష్టిఖండం 49\50–56)

గృహస్థాశ్రమం పరిత్యజించి నిరంతరము నాయందే మనస్సును లగ్నం చేసి దినదినమూ నా గోవిందనామాన్ని ఎవడు స్మరణ చేస్తూ ఉంటాడో వాని పాపాలు అన్నీ చెల్లిపోతాయి. అనగా అతడు చేసిన వేలాది బ్రహ్మహత్యామహాపాతకాలూ, మహాదోషాలు, లక్షమారులు చేసిన మధుమాంససేవనం వలన సంక్రమించిన మహాపాపాలు, బంగారం దొంగిలించడం అట్టిపాపాలు చేసినవారితో సంబంధం కలిగి ఉండడం వలన సంక్రమించిన పాతకాలూ, ఇవి గాక ఇతరములైన మహాపాపాలు ఏవి ఏవి ఉన్నాయో అవి యన్నీ నా నామస్మరణం చేయడంవలన అగ్నియొక్క సంపర్కం చేత దూదిరాశి క్షణంలో ఎలా భస్మీపటలం అవుతుందో అలా నశించిపోతాయి. కాబట్టి నా గోవిందనామాన్ని సంస్మరించి పవిత్రుడు కావడం మానవుని కర్తవ్యం. (అయితే ఇక్కడ ముఖ్యంగా గుర్తించవలసిన విషయం ఒకటి ఉంది. అది ఏమంటే ఎన్నిఘోరపాపాలు చేసినా పోగొట్టుకోవడానికి భగవన్నామం అనే సాధనం ఉంది కదా. అన్న ధీమాతో ఇచ్చవచ్చిన విధంగా పాపాలు చేస్తూ ఉండేవాని పాపాలను మాత్రం

భగవన్నామం హరించదు). అట్లుకాక మానవుడు గోవిందనామసంకీర్తనమూ, గోవిందపూజనమూ చేసుకొంటూ గృహస్థాశ్రమంలోనే ఉన్నను వాడు కూడ పాపవిముక్తిని పొందుతాడు. గంగాతీరంలో పరమపవిత్రమైన చంద్రగ్రహణకాలంలో కోట్లకొలది గోవులను దానంచేస్తే ఏ ఫలితం ప్రాప్తిస్తుందో దానికంటెను వేయిరెట్లు ఎక్కువ ఫలితం గోవిందనామసంకీర్తనం వలన ప్రాప్తిస్తుంది. అలా సంకీర్తనం చేసినవారు నా వైకుంఠధామంలో శాశ్వతనివాసాన్ని పొందుతారు.

పురాణాలలో వర్ణించబడిన నా చరిత్రమును ఆలకించినవాడు నాతో సమానత్వాన్ని పొందుతాడు. పురాణంలోని గాథను ప్రవచించినవాడు నాసాయుజ్యాన్ని పొందుతాడు. కాబట్టి నిత్యమూ పురాణశ్రవణం చేస్తుండాలి. పురాణం అంటే ధర్మాలప్రోవు.

బ్రాహ్మణోత్తమా! నరోత్తమా! ఇప్పుడు నేను నీకు సతీమతల్లులైన స్త్రీలయందు ఉండే ఉత్తమలక్షణాలను వివరిస్తున్నాను విను! సతీమతల్లి వంశం పరిశుద్ధం అవుతుంది. అందు సర్వదా మహాలక్ష్మి నివసిస్తూ ఉంటుంది. సతీమతల్లియైన యామె యొక్క పితృకులానికీ, భర్తృకులానికీ, ఆమె భర్తకూ కూడ అంతమందు స్వర్గప్రాప్తి కలుగుతుంది. ఆదిలో పుణ్యపాపమిశ్రమంగా ఉండే కర్మలతో కాలం గడిపి అనంతరకాలమందు పతివ్రతలుగా మారిన స్త్రీలకు కూడ నా లోకం ప్రాప్తిస్తుంది. త్రాగుబోతు, బ్రహ్మహత్యలు గావించినవాడు, అనేక విధాలైన పాపాలభారంతో క్రుంగుతూ ఉన్నవాడూ అయిన భర్తను తిరస్కరించకుండ అనుగమనం చేసిన స్త్రీ తనతో బాటు తన భర్తను కూడ పాపవిముక్తుని చేసి స్వర్గానికి కొనిపోతుంది.

భర్త మరణించుటతోడనే ప్రాణపరిత్యాగం చేసినస్త్రీకి స్వర్గప్రాప్తి తథ్యం. పతిని అనుగమించిన స్త్రీ మానవుని శరీరంలో ఎన్ని రోమాలు (3.5 కోట్లు) ఉంటాయో అన్ని సంవత్సరాలవరకూ స్వర్గలోక నివాససౌభాగ్యాన్ని పొందుతుంది. భర్త దూరదేశంలో మరణించిన సందర్భంలో అతని చిహ్నం ఏదైన పొంది చితినిపేర్చి నిప్పుముట్టించి

అందు ప్రవేశించి ప్రాణపరిత్యాగం చేసినస్త్రీ తనతో పాటు తన భర్తను కూడ పాపవిముక్తుని గావిస్తుంది. భర్త పరదేశంలో మరణించడం సంభవం అయినప్పుడు, అతని వస్తువు ఏదైన ఆనవాలుగా గ్రహించి వెంటనే అగ్నిప్రవేశం చేసి ప్రాణాలు వీడి స్వర్లోక యాత్ర చేయడం పతివ్రతయైన స్త్రీకి పరమకర్తవ్యం. మరణించిన తన భర్తతోడ బ్రాహ్మణస్త్రీ మాత్రం చితాగ్ని ప్రవేశం చేయకూడదు. అలా చేస్తే ఆమెకు ఆత్మహత్యామహాపాతకం సంక్రమిస్తుంది. అలా చేసినస్త్రీకి గాని, ఆమె భర్తకు కాని స్వర్గం ప్రాప్తించదు.

కాబట్టి బ్రాహ్మణస్త్రీ యెన్నడూ తన మరణించిన భర్తతోడ సహగమనం (అగ్నిదగ్ధం కావడం) చేయరాదు. ఇది బ్రహ్మదేవుని ఆజ్ఞ. మగడు పోయిన బ్రాహ్మణస్త్రీ వైధవ్యవ్రతాన్ని పాటించాలి. ఏ వితంతువు ఏకాదశీవ్రతాన్ని పాటించదో ఆమె మరుజన్మమందు కూడ వైధవ్యాన్ని పొందడమే కాక ప్రతి జన్మలోనూ దుర్భాగ్యదశను పొంది బాధపడుతుంది. జిహ్వాచాపల్యం వీడక మత్స్యమాంసాది భక్షణం మానక, వ్రతనియమాలు ఏవీ పాటించక కాలం గడపిన వితంతువు చిరకాలం నరకాగ్నిలో మ్రగ్గి కడకు కుక్కజన్మను పొందుతుంది. ఏ వితంతువు కులనాశకురాలై దురాచారపరురాలై మైథునం చేయించుకుంటుందో ఆమె నరకయాతనలు అన్నీ అనుభవించిన మీదట పది జన్మలదాక ఆడ గ్రద్దగానూ, రెండు జన్మలు గుంటనక్కగాను పుట్టి అనంతరం మానవస్త్రీగా జన్మిస్తుంది. ఆ జన్మలో కూడ బాలవిధవయై దాసీభావాన్ని పొందుతుంది.

ఈ వివరణం అంతావిని నరోత్తముడు మరల – అఖిలజగదంతర్యామీ! స్వామీ! నాయందు కృపజూపి మీరు ఇప్పుడు కన్యాదానఫలాన్ని వివరిస్తూ దాని వాస్తవికవిధానాన్ని కూడ తెలియచేయండి, అని భగవానుని కోరాడు.

అప్పుడు భగవానుడు ఇలా అన్నాడు – బ్రాహ్మణవరేణ్యా! చెపుతున్నాను. విను! రూపవంతుడూ, గుణవంతుడూ, కులీనుడూ, యువకుడూ, సమృద్ధిశాలి, ధనధాన్యసంపదకలవాడూ అయిన వరునకు కన్యాదానం చేయాలి. అలా చేస్తే కలిగే ఫలితం ఏమో వివరిస్తున్నాను.

అలకించు. ఆభరణాలతో అలంకృతురాలైన కన్యను యోగ్యుడైన వరునకు దానం చేసినవాడు కొండలతో, కోనలతో, తోటలతో, దొడ్లతో, కానలతో కూడిన సమస్తభూమండలాన్ని దానం చేసినంత పుణ్యఫలాన్ని పొందుతాడు.

శ్లో. యః పునశ్శుల్క మశ్నాతి స యాతి నరకం నరః ।
విక్రీత్వా చాత్మజాం మూఢో నరకాన్న నివర్తతే ॥

లోభాదసదృశే పుంసి కన్యాం యస్తు ప్రయచ్ఛతి ।
రౌరవం నరకం ప్రాప్య చాండాలత్వం చ గచ్ఛతి ॥
(పద్మపురాణం. సృష్టిఖండం 49\90–91)

కన్యాశుల్కం గ్రహించి దానితో జీవనయాపనం చేసిన తండ్రి నరకంలో కూలుతాడు. కూతురును అమ్ముకొన్న తండ్రికి పుట్టగతులు ఉండవు. వానికి నరకం నుండి విముక్తి లేదు. ఆశకులోబడి అయోగ్యునకు కన్యాదానం చేసిన వాడు రౌరవనరకయాతనలను అనుభవించి అంతమందు చండాలుడై జన్మిస్తాడు.

కాబట్టి విద్యావంతుడు ఎన్నడూ అల్లునినుండి శుల్కం గ్రహించాలి అన్న తలంపు పెట్టుకోరాదు. తాను స్వయంగా తన అల్లునకు ఏమి ఇచ్చినా అది అక్షయపుణ్యఫలాన్ని చేకూరుస్తుంది. భూమి, గోవులు, బంగారమూ, ధనధాన్యాలూ, వస్త్రాదులూ ఏవి అల్లునకు కట్నంగా ఇచ్చినా అది అక్షయపుణ్యఫలాన్ని ఇస్తుంది. తెగిపోయిన త్రాడు నీరు తోడుకునే బాల్చీతో కూడి ఎలా నూతిలో కూలిపోతుందో అలాగే ఏదైన దానం చేస్తున్నాను అని సంకల్పించి తరువాత ఆదానం విషయం మరచిపోయినవారూ, ఆదానం విషయం జ్ఞప్తికి తెచ్చి సంకల్పించిన దానం చేయుమని కోరని ప్రతిగ్రహీతయు (దానం గ్రహించేవాడు) ఇరువురూ నరకంలో కూలుతారు.

అల్లునకు ఏయే వస్తువులను ఇస్తామని ముందు నిర్ణయించుకోవడం జరిగిందో ఆ వస్తువులను అన్నిటినీ ఇచ్చివేయడమే సత్త్వగుణ

సంపన్నుడైన పురుషుని కర్తవ్యం. అలా చేయనినాడు అతడు నరకంలో కూలడమే కాక దానం గ్రహించేవాని దగ్గర దాసుడుగా జన్మిస్తాడు.

మితి మీరి తిండి తినేవాడూ, బహుదూరంలో నివసించేవాడూ, మితిమీరిన ధనం కలవాడూ, దుష్టత్వం అధికంగా ఉన్నవాడూ, ఉత్తమవంశంవాడు కానివాడూ, పరమమూర్ఖుడు ఈ ఆరుగురకు ఎన్నడూ కన్యను ఈయరాదు. అలాగే ముదిమి బలిసినవాడు, పరమదరిద్రుడు, వ్యాధిగ్రస్తుడు, మిక్కిలి చేరువగా ఉండేవాడు, మితి మీరిన కోపం గలవాడు, ఎంత ప్రాప్తించినా సంతుష్టిలేనివాడు ఈ ఆరుగురకును కూడ కన్యాదానం చేయకూడదు. ఇట్టివారికి కన్యాదానం చేసినవాడు నరకంపాలు అవుతాడు. ధనం వస్తుంది అన్న ఆశతోనో, గౌరవం ప్రాప్తిస్తుంది అన్న భావనతోనో కన్యాదానం చేసినవాడు, ఒక కన్యను చూపి మోసం చేసి మరొక కన్యకు వివాహం చేసినవాడు ఇరువురూ నరకంపాలు అవుతారు. పరమపవిత్రమైన ఈ ఉపాఖ్యానాన్ని నిత్యమూ ఆలకించినవాడు జన్మజన్మగతపాపాల వలయంనుండి విముక్తుడు అయిపోతాడు.

----oOo----

## తులాధారుని సత్యము, సమత్వములప్రశంస, సత్యభాషణ మహత్త్వము, లోభరహితుడైన శూద్రుని కథ, మూక చండాలాదుల పరమధామ గమనము

ప్రభూ! నాపై మీకు పరిపూర్ణానుగ్రహం ఉన్న యెడల నాకు మీరు ఇప్పుడు తులాధారుని చరిత్రమును, అతని మహాప్రభావమును విశదముగా తెలియజేయండి, అని బ్రాహ్మణవరేణ్యుడైన నరోత్తముడు ఘరల భగవానుని ప్రార్థించెను.

అప్పుడు భగవానుడు ఇలా చెప్పడం మొదలుపెట్టాడు – సత్యాన్ని పాటిస్తూ లోభవృత్తిని, దోషబుద్ధిని వీడి ప్రతిదినమూ ఎంతో కొంత దానం చేసేవాడు, నిత్యమూ ఉత్తమదక్షిణలతో కూడిన నూరు యజ్ఞాలను అనుష్ఠించినంత పుణ్యఫలాన్ని పొందుతాడు.

శ్లో. సత్యేనోదయతే సూరో వాతి వాదస్తదైవ చ ।
న లంఘయేత్ సముద్రస్తు కూర్మో వా ధరణీం యథా ॥

సత్యేన లోకాస్తిష్ఠంతి పర్వే చ వసుధాధరాః ।
సత్యాద్భ్రష్టోఽథ య స్సత్త్వేకప్యధోవాసీ భవేద్ధ్రువమ్ ॥

సత్యవాచి రతో యస్తు సత్యకార్యరతస్సదా ।
పశరీరేణ స్వర్లోకమాగత్యాచ్యుతతాం వ్రజేత్ ॥

సత్యేన మునయస్సర్వే మాం చ గత్వా స్థిరాః స్థితాః ।
సత్యాద్యుధిష్ఠిరో రాజా పశరీరో దివం గతః ॥
(పద్మపురాణం, సృష్టిఖండం 50\3–6)

సత్యంవలననే సూర్యుడు ఉదయిస్తున్నాడు. సత్యం వలననే వాయువు వీస్తుంది. సత్యం యొక్క ప్రభావం చేతనే సముద్రం హద్దు మీరకుండ ఉంటోంది. సత్యం వలననే మహాకూర్మమూర్తి ఈ భూమండలాన్ని

సభాముఖాన సత్యం పలికిన వక్తయు, విద్వాంసుడునూ ఎన్నో యజ్ఞాలు చేసినా ప్రాప్తంకాని బ్రహ్మధామాన్ని పొందగలుగుతాడు. సభాసమక్షాన సత్యం పలికినవాడు అశ్వమేధయజ్ఞం చేసినంతపుణ్యఫలాన్ని పొందుతాడు. లోభానికో, ద్వేషానికో లోబడి అసత్యం పలికినవాడు రౌరవనరకంపాలవుతాడు. తులాధారుడు సర్వసాక్షియైనవాడు. అతడు మానవులలో సూర్యుడు అనదగినవాడు. ఇక్కడ ముఖ్యంగా గుర్తించవలసిన విషయం ఏమంటే ఒక్క లోభగుణాన్ని (ఆశ, పిసినారితనం) విడిచిపెడితే చాలు. మానవుడు స్వర్గంలోని దేవతల వంటివాడు అవుతాడు.

ఒక మహాభాగ్యశాలియైన శూద్రుడు ఉండేవాడు. అతడు ఎన్నడూ లోభవృత్తికి లోబడేవాడు కాదు.ఆకుకూరలు తిని, బజారులో నేలరాలిన ఆహారపుగింజలను ఏరుకొని పొలాలలో వదలివేయబడిన వరిధాన్యపు కంకులను సేకరించుకొని అతికష్టంమీద జీవన నిర్వహణం చేసుకొనేవాడు. అతని దగ్గర పాతవై తూట్లు పడిన రెండు వస్త్రాలు మాత్రమే ఉండేవి. చెంబులు, గిన్నెలువంటి పాత్రలు ఏవీ అతని దగ్గర ఉండేవి కావు. అతడు తన చేతులనే పాత్రలుగా ఉపయోగించుకొనేవాడు. అతనికి ఎన్నడూ ఏ వస్తువూ లభించలేదు. అయినా అతనికి పరధనం మీద ఇచ్ఛలేదు.

ఒకనాడు నేను వానిని పరీక్షించాలని సంకల్పించుకొని రెండు నూతన వస్త్రాలను తీసుకొనిపోయి నదీతీరంలో అతని కంటబడే విధంగా ఒక మూలఉంచి వానికి కానరాని విధంగా నేను దూరంగాపోయి నిలిచాను. ఆ నూతనవస్త్రాలను అన్యులు ఎవ్వరూ లేనిచోట ఉండగా చూచికూడ ఆ శూద్రుని మనస్సులో లోభం ఉదయించలేదు. ఎవరివో బట్టలు ఇక్కడ పడిఉన్నాయి అని భావించుకొంటూ అతడు వానిని ఉపేక్షించి మౌనంగా తనయింటికి వెడలిపోయాడు.

అప్పుడు ఈ వస్త్రలాభం అల్పలాభం అని భావించియే అతడు గ్రహించలేదు అని ఆలోచించి నేను మరల ఒక మేడిపండులో బంగారపు కణికను ఉంచి దానిని ఆ ప్రదేశమందే ఉంచి కనుమరుగు అయ్యాను. ఆ ప్రదేశం మగధదేశంలో ఒక నదీతీరాన మారుమూలలగా నిర్జనంగా ఉన్న

ప్రదేశం. అచ్చటకు చేరి అతడు ఆ అద్భుతఫలాన్ని చూచాడు. అప్పుడు అతడు తనలో ఇలా అనుకున్నాడు. - చాలును! చాలును! ఇది యేదో కృత్రిమవిధానంగా తోస్తోంది. ఇప్పుడు ఈ పండును గ్రహిస్తే నాలోని అలోభవృత్తి (లోభంలేక పోవడం) అంతరించిపోతుంది. గ్రహించినా ఈ ధనాన్ని రక్షించడంలో చాలకష్టాన్ని భరించవలసివస్తుంది. ఇది అహంకారానికి ఆటపట్టు. లాభం కలుగుతూ ఉన్నకొలది లోభం పెరుగుతూ ఉంటుంది. లోభానికి లాభమే జన్మభూమి. లోభగ్రస్తుడైనవాడు సర్వదా నరకంలో పడి ఉండవలసివస్తుంది.

ఈ గుణహీనమైన ద్రవ్యం నాయింట ఉంటే నా భార్యకూ బిడ్డలకూ పిచ్చిఎక్కిపోతుంది. ఉన్మాదం కోరికవలన కలిగే వికారం, దానివలన బుద్ధి భ్రాంతం అవుతుంది. భ్రాంతివలన మోహమూ, అహంకారమూ ఉదయిస్తాయి. వాని నుండి క్రోధము, లోభము పుట్టుకువస్తాయి. ఈ అవలక్షణాలు అన్నీ ప్రబలినప్పుడు చేసుకున్న తపస్సు క్షీణించిపోతుంది. తపస్సు క్షీణిస్తే చిత్తాన్ని మోహగ్రస్తం చేసే మాలిన్యం పెరుగుతుంది. ఆ మాలిన్యపు ఉచ్చులో తగులుకొన్న మనుష్యుడు పతనావస్థను తప్పించుకొని ఇక మరలపైకి లేవలేడు.

ఈ విధంగా ఆలోచించుకొని ఆ శూద్రుడు ఆ ఫలాన్ని అచ్చటనే వదలి తన యింటికి మరలిపోయాడు. అప్పుడు స్వర్గంలోని దేవతలు అందరూ మేలు! మేలు! భళీ! భళీ! అని అతనిని ప్రశంసింప నారంభించారు. అప్పుడు నేను క్షపణకుని (సన్న్యాసి) రూపం దాల్చి వాని యింటి సమీపమునకు చేరి జనులతో వారి అదృష్టమును గూర్చి వివరించడం మొదలుపెట్టాను. ముఖ్యంగా జరిగిపోయిన విషయాలను తెలుపసాగాను. తరచుగా జనులు వస్తూ పోతూ ఉండడం వలన నా సమాచారం నాలుగు దిక్కులా వ్యాపించింది. అదివిని ఆ శూద్రుని భార్య నా దగ్గరకు వచ్చి తన భాగ్యమును గూర్చి ప్రశ్నించింది.

నేను వెంటనే ఆమె మనస్సులోని మాటను ఆమెకు చెప్పి ఏకాంతంలో ఆమెతో ఇలా అన్నాను - తల్లీ! విధాత యీనాడు నీకు చాల

ధనం ఇచ్చాడు. కాని నీ భర్త మూర్ఖుని వలె దానిని తృణంలాగ వదలివేసాడు. నీయింట ఈషణ్మాత్రమూ ధనం లేదు. పరిరామోకాలు అడ్డుపెట్టినవాడైన కారణంగా నీ భర్త బ్రతికియున్నంత కాలమూ నీకు దారిద్ర్యపుబాధ తప్పదు. వెంటనే ఇంటికి పోయి ఆధనం విషయం నీ భర్తను అడుగు, నీకే తెలుస్తుంది. అనగా విని ఆమె తన భర్త దగ్గరకు పోయి ఆ విషయం చర్చించింది. ఆమె మాటలు విని శూద్రుడు విస్మితుడు అయ్యాడు. క్షణకాలం తనలో ఏమో ఆలోచించుకొని భార్యను వెంటబెట్టుకొని ఏకాంతంలో నా దగ్గరకు వచ్చి –క్షపణకా! నీవు ఇంతకు ముందు చెప్పినది ఏమో మరల చెప్పు అని ప్రశ్నించాడు.

అప్పుడు క్షపణకరూపంలో ఉన్న నేను ఇలా అన్నాను – నాయనా! నీకు ప్రత్యక్షంగా ధనం లభించగా దానిని గడ్డిపరకలాగున ఎందులకు విడిచిపెట్టావు? నీ యీ చర్య వలన నీ అదృష్టంలో సుఖము అన్నది లేదని తోస్తోంది. ధనహీనతకారణంగా నీవు పుట్టినది మొదలు మరణించే వరకు నీ బంధువర్గంతోడ కష్టాలపాలు కావలసివస్తుంది. ప్రతిదినమూ మీరందరూ మృతప్రాయులుగా పడియుండవలసిన పరిస్థితి ప్రాప్తిస్తుంది. కాబట్టి వెంటనే అక్కడకు పోయి ఆ ధనాన్ని గ్రహించి నిరాటంకంగా భోగసుఖాలను అనుభవించు.

నా మాటలు విని మరల శూద్రుడు ఇలా అన్నాడు – క్షపణకా! నాకు ధనం మీద కాంక్షలేదు. ధనం అనేది మానవుని సంసారంలో బంధించివేసే ఉచ్చు. అందు తగుల్కొన్నవాడు ఇక ఉద్ధరింపబడడం అసంభవం. ఇహమందు, పరమందు కూడ ధనమునకు సంబంధించిన దోషాలు అనేకం ఉన్నాయి, చెప్తున్నాను విను! ధనం ఉంటే దొంగలవలన, బంధుబాంధవులవలన, పాలకులవలన భయం ఉంటుంది. ఎల్లవారూ ( ఆ ధనాన్ని హరించివేసే తలంపుతో) ధనవంతుని చంపివేయడానికి ఉద్యమిస్తూ ఉంటారు. ఇట్టి దశలో ధనం ఎలా సుఖదాయకం అవుతుంది? ధనం అనేది ప్రాణాలను బాధిస్తుంది. పాపాలను కలిగిస్తుంది. ధనవంతుని గృహం కాలునకూ, కామాదిదోషాలకు నెలవు అవుతుంది. కాబట్టి ధనం అనేది దుర్గతికి మూలకారణం అగునట్టిది.

అనగా విని నేను మరల ఇలా అన్నాను - ఇదిగో! నేను చెపుతూ ఉన్న మాటలు విను! ధనం ఉన్నవానికి అందరూ మిత్రులు అవుతారు. అందరూ సోదరులు, బంధువులు అవుతారు. కులము, శీలము, పాండిత్యము, రూపము, సుఖభోగాలు, కీర్తిప్రతిష్ఠలు - ఈ సమస్తమూ ధనవంతునకు ప్రాప్తిస్తాయి. ధనహీనుడైన వానిని భార్య, బిడ్డలూ కూడ వీడి పోతారు. ఇక వానికి మిత్రులు ఎలా లభిస్తారు? గర్భదరిద్రుడైనవానికి ధర్మాన్ని అనుష్ఠించే సందర్భం ఎలా వస్తుంది? సాత్త్వికములైన యజ్ఞాలు, వాపీకూపతటాకాదులవంటి వాని నిర్మాణమూ మొదలైన పనులు స్వర్గాన్ని సాధించిపెట్టే సాధనాలు.

అవి ధనం లేకుంటే ఎలా సాధ్యములు అవుతాయి? దానం అనేది మానవులకు స్వర్గారోహణానికి సహకరించే సోపానం (మెట్టు) అయినా నిర్ధనుడైన వాడు దానం ఎలా చేయగలుగుతాడు? వ్రతాదివిధులను పాటించడం, ధర్మోపదేశాదులను శ్రవణం చేయడం, పితృయజ్ఞాదిక్రియలను ఆచరించడం, తీర్థయాత్రలు సాగించడము వంటి పనులు ధనహీనునకు సాధ్యం అగునట్టివి కావు. రోగాల నివారణమూ, ఔషధాలను సేవించడము, సేకరించడము, శరీరసంరక్షణమూ, శత్రువిజయమూ వంటి పనులు అన్నీ ధనం వలననే సాధ్యం అవుతాయి. కాబట్టి ధనం ఉన్నవాడే భోగాన్ని పొందుతాడు. ఆ ధనం ఉంటే నీవు దానాలు చేసి శీఘ్రంగా స్వర్గాన్ని పొందవచ్చును.

ఈ నా మాటలు విని శూద్రుడు మరల ఇలా అన్నాడు - కోరికలను పరిత్యజించిన వాడు ఎల్లవ్రతాలనూ ఆచరించినవాడు అవుతాడు. క్రోధాన్ని వీడినవాడు సమస్తతీర్థాలనూ సేవించినవాడు అవుతాడు. దయాగుణం జపం వంటిది. సంతోషం పరిశుద్ధమైన ధనం, అహింసావ్రతపాలనం సర్వోత్తమమైన సిద్ధి. శిలోంఛవృత్తివంటి పవిత్రజీవనసాధనం వేరొకటి లేదు. (కోతలు కోసిన మీదట చేలలో జారిపడిన ధాన్యపు వెన్నులను ఏరితెచ్చుకొని వానితో జీవించునట్టి వృత్తి) శాకాహారం అమృతతుల్యం అయిన ఆహారం. ఉపవాసంవంటి ఉత్తమతపస్సు వేరొకటి లేదు. నా వంటివాడు ఒక గవ్వను దానం చేసినా మహాదానమే అవుతుంది.

పరస్త్రీలు నాకు తల్లులవంటివారు. పరధనం మట్టిబెడ్డవంటిది. పరస్త్రీ త్రాచుపాము వంటిది. ఇది అంతా నేను ఆచరించే యజ్ఞం. గుణనిధివైన ఓ మహాత్మా! ఈ కారణం చేతనే నేను ధనగ్రహణం చేయడం లేదు. నిజం చెప్పుతున్నాను. విను! బురద పులిమికొని కడుగుకొనుటకంటె దానిని ఎట్టి పరిస్థితిలోనూ తాకకుండ ఉండడమే మేలు.

ఈ విధంగా నరోత్తమునకు శూద్రుని చరిత్రమును తెల్పుతూ ఉన్న భగవానుడగు శ్రీహరి అతనితో ఇంకనూ ఇలా అన్నాడు –బ్రాహ్మణవరేణ్యా! ఈ శూద్రుని చరిత్రమును ఆలకిస్తున్నావు కదా! అతడు ఆ విధంగా ధనం విషయంలో తన కాంక్షారాహిత్యాన్ని వెల్లడించగానే దేవతలు వానిపై పూలవానలు కురియింపసాగారు. నగారాలు మ్రోగింపసాగారు. గంధర్వులు గానాలు చేయసాగారు. వెంటనే ఆకాశంనుండి విమానం ఒకటి క్రిందకు అవతరించింది. అప్పుడు దేవతలు వానితో ధర్మాత్మా! ఈ విమానాన్ని అధిరోహించి సత్యలోకానికి పోయి అక్కడ దివ్యభోగాలను అనుభవించు. అక్కడ నీ భోగకాలానికి పరిమితిలేదు. అనంతకాలపర్యంతమూ పుణ్యఫలాన్ని అనుభవించు. అని పలికారు. అప్పుడు శూద్రుడు వారిని దేవతలారా! ఈ క్షపణకునకు ఇంతటి జ్ఞానము, ఇలాటి ప్రయత్నము, ఈ విధమైన భాషణశక్తి ఎలా ప్రాప్తించాయి. ఈతని రూపంలో శ్రీమహావిష్ణువు కాని, పరమశివుడు కాని, బ్రహ్మకాని, శుక్రుడో, బృహస్పతియో కాని ప్రచ్ఛన్నంగా ఉండలేదు కదా? లేదా నన్ను పరీక్షించుటకు సాక్షాత్తూ ధర్మదేవతయే యీ రూపంలో నాముందునకు వచ్చియుండలేదు కదా? అని ప్రశ్నించాడు.

అప్పుడు క్షపణకరూపంలో ఉన్న నేను – మహామునీ! నేను సాక్షాత్తూ విష్ణుమూర్తిని నీ ధర్మనిష్ఠను తెలుసుకొనుటకై ఇక్కడకు వచ్చాను. ఇక నీవు సపరివారంగా స్వర్గానికి వెడలుమూ, అని బదులు పలికితిని.

అనంతరం ఆ శూద్రుడు దివ్యవస్త్రాభరణాదులను ధరించి సపరివారంగా స్వర్గానికి వెడలిపోయాడు. ఈ విధంగా ఆ శూద్రుని పరివారంలోని వారు అందరూ లోభవృత్తిని పరిత్యజించిన కారణాన

స్వర్గసౌభాగ్యాన్ని అందుకున్నారు.

ఇక బుద్ధిమంతుడైన తులాధారుడు ఉన్నాడు. అతడు ధర్మాత్ముడు. సత్యధర్మంలో నెలకొనియున్నవాడు. ఆ కారణంగానే ఎక్కడ ఎప్పుడో సంఘటిల్లిన విషయాలను తెలుసుకోగల శక్తి అతనికి వచ్చింది. ఆ తులాధారునకు సాటిగా ప్రతిష్ఠ పొందిన వ్యక్తి వేరొకడు దేవలోకంలో కూడ లేడు. ఏ మానవుడు సర్వధర్మనిష్ఠ వహించి ఈ ఉపాఖ్యానాన్ని ఆలకిస్తాడో వాడు తత్కాలమందే అనేక జన్మల పాపాలనుండి విముక్తుడు అయిపోతాడు.

ఈ ప్రకరణాన్ని ఒక్క మారు పఠిస్తే చాలు! మానవుడు సర్వయజ్ఞాలనూ ఆచరించినంత పుణ్యఫలాన్ని పొందుతాడు. అతడు ఈ లోకంలో శ్రేష్ఠత్వాన్ని పొంది దేవతలకు కూడ పూజ్యుడు అవుతాడు. అనంతరం ధర్మపరాయణులైన మూకచండాలాదులు అందరూ పరమధామానికి వెడలిపోయే సంకల్పంతో భగవానుని సన్నిధికి వచ్చారు. వారితోడ వారి భార్యలూ, ఇతరపరికరాలూ కూడ వచ్చాయి. అంతే కాదు వారి యింటి పరిసరాలలో తిరుగాడే బల్లులూ, వివిధములైన యితర క్రిమికీటకాదులు సైతమూ దివ్యరూపాలను ధరించి యా మహాభాగులను అనుగమించుటకు విచ్చేసాయి. ఆ సమయంలో దేవతలూ, సిద్ధులూ, మహర్షులూ బాగు! బాగు! మేలు! మేలు! ధన్యాత్ములు! అను ప్రశంసావచనాలతో వారిమీద పూలవానను కురిపించారు. విమానాలలోను, వనాలలోను ఉండి దేవతలు నగారాలను మ్రోగించారు. ఈ విధంగా మంగళవాద్యపురస్సరంగా వారందరూ తమకు నిర్దిష్టములైన విమానాలను అధిరోహించి విష్ణుధామానికి వెడలిపోయారు. అప్పుడు ఆ నరోత్తముడు ఆ అద్భుతదృశ్యాన్ని చూచి ముగ్ధుడై – దేవదేవ! మధుసూదన! కేశవ! ఇప్పుడు నాకు మీరు ఏదయినా మంచి విషయం ఉపదేశించండి, అని భగవానుని కోరాడు.

అప్పుడు భగవానుడు ఇలా అన్నాడు – వత్సా! నీ మాతాపితరులు శోకాకులచిత్తులై యున్నారు. కాబట్టి ముందు నీవు వారికడకు పోయి భక్తితో

ప్రయత్నపూర్వకంగా వారిని ఆరాధించు! అలా చేస్తే అనంతరకాలమందు శీఘ్రంగా నీవు నా పుణ్యధామాన్ని పొందగలుగుతావు. తల్లిదండ్రులకు సాటియగు దేవతలు దేవలోకంలో కూడ ఉండరు. శైశవావస్థలో వారు రోత గలిగించే నీ శరీరాన్ని సంరక్షించి పోషించారు. అజ్ఞానదోషాచ్ఛన్నుడవైన నిన్ను జ్ఞానవంతునిగా తీర్చిదిద్దారు. చరాచరప్రాణులతో కూడియున్న మూడులోకాలలోనూ మాతాపితరులవలె పూజనీయులైన వారు వేరు ఎవ్వరూలేరు.

ఈ విధంగా దేవతలందరూ మూకచండాలుడు, పతివ్రతయగు శుభాదేవి, వైశ్య, శిఖామణి యగు తులాధారుడు, సజ్జనాద్రోహకుడు, వైష్ణవసాధువు - అను ఈ అయిదుగురు మహానుభావులను వెంటనిడుకొని సానందంగా భగవానుని స్తుతించుచూ వైకుంఠ ధామానికి వెడలిపోయారు. వారు అందరూ అచ్యుతస్వరూపాలను పొంది సమస్తలోకాలకూపైన ఉండే ఉత్తమస్థానాన్ని పొందారు. నరోత్తమబ్రాహ్మణుడు కూడ ప్రయత్నపూర్వకంగా మాతాపితరులకు సేవలు చేసి అనతికాలమందే సకుటుంబంగా భగవద్ధామాన్ని పొందాడు.

ఈ విధంగా వ్యాసభగవానుడు తన శిష్యులకు ఈ విషయాలు అన్నీ ఉపదేశించి వారితో ఇలా అన్నాడు - నాయనలారా! ఇప్పుడు ఈ విధంగా మీకు అయిదుగురు మహాత్ముల పవిత్రచరిత్రమును వినిపించాను. దీనిని పఠించినా, ఆలకించినా మానవుడు దుర్గతిని పొందకుండా ఉంటాడు. అతడు బ్రహ్మహత్య మొదలైన మహాపాపాలనుండి విముక్తుడు అవుతాడు. ఒక్కమారు ఈ ఉపాఖ్యానాన్ని ఆలకిస్తే చాలు మానవుడు కోట్లకొలది గోదానాలూ, పుష్కరతీర్థమందు, గంగానదియందు స్నానమూ చేసినంత పుణ్యఫలాన్ని పొందుతాడు.

-----oOo----

# నాలుగు మంచి మాటలు

"మహారాజు యుధిష్ఠిరుడు తరుణం వస్తే తనలో ఉన్న నిర్వైరత్వము, ధైర్యము, క్షమాగుణము, క్రోధరాహిత్యమూ, ఆదిగా ఉన్న శుభగుణాలను వాచికంగానే కాక అనగా మాటలలోనే కాక చేతలలో కూడ ప్రదర్శిస్తూ ఉండేవాడు. సత్యపాలనం అనేది అతనికి ప్రాణతుల్యం అయిన నియమం. ఈ విషయంలో ఈనాటికిని అతడు అద్వితీయుడు. అనుపమానుడు అని జనులచే తలపబడుతున్నాడు. అతని ప్రతిమాటలోను విద్వత్తూ, వివేకమూ ఉట్టిపడుతూ ఉండేవి అనే విషయం యక్షుని ప్రసంగం వలన వ్యక్తం అవుతుంది. అతడు తనలోని సమతాగుణాన్ని నిలుపుకోవడం కోసం తన సోదరులను కూడ తృణీకరించిన మహాభాగుడు. అతడు ఎక్కడ ఉంటే అక్కడి ప్రాంతభూమి అంతా పవిత్రం అయ్యేది. అతడు అంత పవిత్రచరిత్రుడు. అతనిలోని శమదమాది శుభగుణసంపద చేత ప్రభావితమై దేశం అంతా సంయమలక్షణం కలదిగా పరిణతం అయ్యేది. అతనిలోని స్వార్థత్యాగలక్షణం బహువిలక్షణం అయినది. అల్పమైన ఒక కుక్కకోసం అతడు స్వర్గాన్ని కూడ నిరాకరించిన త్యాగధనుడు. అతడు చేసేప్రతి పని స్వార్థత్యాగంతోనూ, దయతోనూ, ప్రేరితమై యుండేది. ధృతరాష్ట్రుడు కోరగా అతడు ప్రదర్శించిన ఔదార్యం అతనిలోని మహోన్నతమైన స్వార్థత్యాగలక్షణాన్ని చెప్పక చెపుతుంది. యజ్ఞము, దానము, తపస్సు, తేజము, శాంతి, లజ్జ, సరళస్వభావము, అభిమానరాహిత్యమూ, లోభము లేకుండుట, భక్తవాత్సల్యమూ మొదలైన సద్గుణాలు ఎన్నో అతనిలో నిండి ఉన్నాయి. ఇలాంటి సర్వవిధశుభగుణ సంపన్నుడైన మహారాజు యుధిష్ఠిరుని జీవితాన్ని ఆదర్శంగా గ్రహించగలిగితే మనకు అందరకు పరమకల్యాణం చేకూరుతుంది అనడంలో ఈషణ్మాత్రమూ సందేహంలేదు. కాబట్టి యీ మహారాజు యుధిష్ఠిరునిలోని యీ శుభగుణాలనూ, అతని ఆదర్శలక్షణాలనూ తమలో క్రమంగా అవతరింపజేసుకొని ధన్యజన్ములు కావాలని మాప్రియతమ పాఠకసోదరులను సవినయముగా ప్రార్థిస్తున్నాను".

"హృదయపూర్వకంగా 'నాథా! నేను నీవాడను' అని అనడంలోనే

శరణు పొందడం మొదలవుతుంది. ఈ మాటయే ముందుముందు వాస్తవిక శరణాగతి రూపాన్ని ధరిస్తుంది. మార్వాడదేశంలో 'క్యామఖ్యాని' అనే మహమ్మదీయజాతి ఉంది. పూర్వం వారు హిందువులేనట, పూర్వం వీరు నివసించే ప్రాంతాన్ని ఏలే పాలకుడు వీరిని మహమ్మదీయులుగా మార్చివేయాలని సంకల్పించి వారితో – నేను మిమ్ము ఒక్క విషయం కోరుతున్నాను. అది ఏమంటే వాస్తవంగా మీరు మహమ్మదీయులు కాకపోయినా ఎవరైన మిమ్ము అడిగినప్పుడు మాత్రం మేము మహమ్మదీయులం అని చెపుతూ ఉండండి! అన్నాడట. ఆ రాజాజ్ఞను పాటించడంలో ఆనాడు ఎవరికీ ఎట్టి అభ్యంతరమూ లేకపోయింది. వారి యింటి వ్యవహారాలు, వారివ్యక్తిగతసంస్కారాలు హిందువులవలెనే ఉండేవి. కాని ఎవరైన అడిగితే వారు తమను మహమ్మదీయులుగానే తెలుపుకొనేవారు. ఇక్కడ ఆశ్చర్యపడవలసిన విషయం ఏమంటే దూరదృష్టిగల ఆ మహమ్మదీయ పాలకుని ఎత్తుగడ శీఘ్రంగా ఫలించింది. ఈనాడు ఆప్రచ్ఛన్నహిందువుల సర్వసంస్కారాలు, వ్యవహారాలు అచ్చపు మహమ్మదీయ సంస్కారాలు, వ్యవహారాలుగా మారిపోయాయి. ఇప్పుడు వారు తమను అచ్చపు మహమ్మదీయులుగానే చెప్పుకుంటున్నారు. ఈ దృష్టాంతాన్ని దృష్టిలో ఉంచుకొని మనం పరమేశ్వరుని రూపంలో ఉన్న మన శాసకుని విశాలరాజ్యంలో ఉంటూ 'ప్రభూ! మేము మీవారము' అని హృదయపూర్వకంగా అంగీకరిస్తే చాలు. మనం అచ్చంగా అతనివారము అయిపోతాము".

"ఏకాంతప్రదేశంలో ఒంటరిగా ఉన్నవేళ మన మనస్సు సుస్థిరంగాను, సుప్రసన్నంగాను ఉండేవిధంగా మనం సాధన చేయాలి. ప్రసన్నచిత్తంతో ఏకాంతంలో శ్వాసగతులను అనుసరించి నిరంతరంగా భగవన్నామజపం చేస్తే ఆ పరిస్థితి సాధ్యం అవుతుంది."

"భగవత్ప్రేమనూ, భక్తిజ్ఞానవైరాగ్యాలను, పెంపొందించే శాస్త్రాలను, గ్రంథాలను చదవాలి."

"ఏకాంతప్రదేశాలలో ధ్యానం చేసుకొంటూ ఉన్న సమయంలో

ఇతరవిషయం ఏది తలంపులలోనికి వచ్చినా వెంటనే దానిని విస్మరించివేయాలి. మనస్సులో సంకల్పాలు ఏవీ కలుగకూడదు. సంకల్పత్యాగం వలన గొప్పలాభం చేకూరుతుంది."

"ధనలాభాపేక్షతో పనులు చేస్తూ ఉంటే మనస్సు సంసారంలో లగ్నం అవుతుంది. కాబట్టి సంసారసంబంధమైన పనులు అన్నీ బహు జాగరూకతతో కేవలము ఒక్క భగవానుని ప్రసన్నతనే లక్ష్యంగా పెట్టుకొని ఆచరిస్తూ ఉండాలి. ఆ విధంగా కూడ ఎక్కువ పని చేయరాదు. చేస్తే ఉద్దేశ్యం మారుతుంది."

"సంసారసంబంధమైన వస్తువులతోటి, వ్యక్తులతోటి సంబంధం ఎంత తక్కువగా ఉంటే అంత మంచిది."

"సంసారవిషయాల ప్రసంగాలు తక్కువగా చేస్తూ ఉండాలి."

"అడుగకుండ ఒకని అవగుణాలను గూర్చి ఎవరితోనూ చెప్పరాదు. ఆ దిశగా దృష్టిని ఎన్నడూ పోనీయరాదు."

----oOo----